Visakha Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 93939 49345

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

P.V.Narayana
(S) 0891-2515158
74519 19119
NEELAM & SON'S
Ayurvedic & Homoeo
Dondaparthy, Akkayyapalem Main Road,
Opp. R.K.Vegetable Bazar,
Visakhapatnam-530 016
Email: neelamsons1930@gmail.com
THE ART OF LIVING

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 11 విశాఖపట్నం, 10 అక్టోబరు 2024 గురువారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు



**విజయవాడ, (విశాఖ సమాచారమ్):** ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను సీఎం చంద్రబాబు తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. సతీమణి నారా భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్‌తో కలిసి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. చంద్రబాబు తలకు స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ పరివేట్టం చుట్టగా.. పట్టువస్త్రాలు, సుమంగళ ద్రవ్యాలను తలపై ఉంచి సీఎం తీసుకెళ్లారు. దుర్గమ్మకు రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం పట్టువస్త్రాలు సమర్పించారు. అంతకుముందు ఆలయం వద్ద సీఎంకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. చంద్రబాబు తన కుటుంబ సభ్యులతో అంతరాలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా డోనర్ సెల్ వివరాలను దేవదాయ శాఖ కమిషనర్, ఈవో సీఎంకు వివరించారు.

దుర్గమ్మ భక్తులందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు దసరా శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మూలా నక్షత్రం రోజు దుర్గమ్మను దర్శించుకోవడం నా అదృష్టం. లక్షల మంది భక్తులు ఎంతో నమ్మకంతో దుర్గమ్మను దర్శించుకుంటున్నారు. మంచి పనులను ఆశీర్వదించాలని దుర్గమ్మను కోరుకున్నా. సేవా కమిటీ ద్వారా అనేక రకాల సేవలు అందిస్తున్నాం. దుర్గగుడి పాలక మండలి సభ్యులకు అభినందనలు. క్యూలైన్లలో భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు

(మిగతా 2లో)

## సమాజంలో కాంగ్రెస్ విషబీజాలు నాటుతోంది: ప్రధాని మోదీ



ముంబయి: ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. సమాజంలో కాంగ్రెస్ విష బీజాలు నాటుతూ..హిందువులను విభజించాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లింలను కేవలం ఓటు బ్యాంకు కోసమే వాడుకుంటున్నారని దుయ్యబట్టారు. హరియాణా ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ(భాజపా) విజయాన్ని ప్రస్తావిస్తూ, అక్కడ కాంగ్రెస్ చేసిన కుట్రలన్నీ విఫలమయ్యాయని అన్నారు. మహారాష్ట్రలో రూ.7,600 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

హరియాణా ఎన్నికల్లో భాజపా చారిత్రాత్మక విజయం దేశ ప్రజల ఆలోచనను తెలియజేస్తోందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఆదివాసీలు, ఇతర వెనుకబడిన తరగతులు (ఓబీసీలు), దళితులు భాజపాకు అండగా నిలిచారని పేర్కొన్నారు. "కాంగ్రెస్ తమ రిజర్వేషన్లను లాక్కొని తమను ఓటు బ్యాంకుగా వాడుకుంటోందని దళితులు గ్రహించారు. దేశంలోని రైతులను కూడా కాంగ్రెస్ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసింది. కానీ, తమకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) ఎవరు ఇచ్చారో హరియాణా రైతులకు తెలుసు కాబట్టే వారు భాజపాను గెలిపించారు. ప్రజలు కాంగ్రెస్‌కు సరైన గుణపాఠం చెప్పారు" అని మోదీ అన్నారు.

హరియాణాలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలనే ఉద్దేశంతో ప్రజల్లో తమను తప్పుగా చూపించడానికి ఎన్నో కథనాలు రచించి.. ద్వేషపూరిత రాజకీయాలకు పాల్పడిందని ఆరోపించారు. సమాజాన్ని నాశనం చేయడానికి పూనుకున్న ఈ

(మిగతా 2లో)

## జగన్ ఇకనైనా తప్పుడు ప్రచారాలు మానుకో: మంత్రి నారా లోకేశ



అమరావతి: జగన్ ఇకనైనా తప్పుడు ప్రచారాలు మానుకోవాలని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. "వరద బాధితులకు ఇస్తామన్న రూ.కోటిలో ఒక్క రూపాయి ఇప్పటికీ ఇవ్వలేదు ఫేక్ జగన్. ఒక వాటర్ ప్యాకెట్, ఒక బిస్కెట్ ప్యాకెట్ కూడా పంపిణీ చేయని ఆయన.. వరద సహాయక చర్యలపై విషం కక్కుతున్నారు. వరద ప్రాంతాల్లో కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలకు రూ.23 కోట్లు అంటూ ఫేక్ ప్రచారం చేయిస్తున్నారు. వీటికి ఖర్చు రూ.23 లక్షలు కూడా కాలేదు. జగన్ పాలనలో వెలువడిన చీకటి జీవోలు,

(మిగతా 2లో)

## హస్తం అతివిశ్వాసం.. : ఆప్

దిల్లీ: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అంచనాలు తలకిందులు కావడంపై ఆ పార్టీలో అంతర్మథనం మొదలైంది. అటు ఇండియా కూటమి పక్షాలు కూడా పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో దేశ రాజధానిలో మరికొన్ని నెలల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేయనున్నట్లు ఆమ్‌ఆద్మీ పార్టీ పేర్కొంది. కాంగ్రెస్ 'అతివిశ్వాసం' మితిమీరిందని విమర్శించింది.

"దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుంది. అతివిశ్వాసంతో ఉన్న కాంగ్రెస్, అహంకార భాజపాపై పోటీ చేసే సామర్థ్యం మాకు ఉంది" అని ఆప్ అధికార ప్రతినిధి ప్రియాంకా కక్కర్ పేర్కొన్నారు. తన భాగస్వామ్య పక్షాలను హరియాణా ఎన్నికల్లో కాంగ్రెస్ పట్టించుకోలేదని, వారికి అతివిశ్వాసం మితిమీరడంతోనే చివరకు ఓటమి చవిచూడాల్సి వచ్చిందని ఆరోపించింది.

(మిగతా 2లో)




## అడవివరంలో దుర్గాదేవి అమ్మ వారి ఘటాలు ఊరేగింపు



**సింహాచలం, (విశాఖ సమాచారమ్):** దసరా శరన్నవరాత్రి ఉత్సవాలల్లో భాగంగా సింహాచలం ఆయిల్ మిల్ వద్ద శ్రీ గణేష్ సేవా సంఘం ఆధ్వర్యంలో విజయ దశమి ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగానే దుర్గా దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు బోనాలు సమర్పణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. అమ్మవారి బోనాలు, ఘటా లు, విగ్రహాలు తో గ్రామం లో ఊరేగింపు నిర్వహించారు. వివద రకాల నైవేద్యాలు సమర్పించారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భవాని మాలలు ధరించిన భక్తులు, మహిళలు పాల్గొని అగ్నిగుండం తొక్కారు. ఈ సందర్భంగానే శ్రీ గణేష్ సేవా సంఘం అసోసియేషన్ అధ్యక్షులు, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు, విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయ సలహా మండలి సభ్యులు, జాతీయ సంఘం కార్యదర్శి గంట్ల శ్రీను బాబు అమ్మవారు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా మాదిరిగానే

(మిగతా 2లో)

## ప్రభుత్వం ఇన్ని పనులు చేస్తే జగన్‌కు కనిపించలేదా?.. ఏపీ మంత్రులు మండిపాటు



**అమరావతి, (విశాఖ సమాచారమ్):** వైకాపా నేతలు అనవసర ఆరోపణలు చేస్తున్నారని మంత్రులు అనిత, అనగాని సత్యప్రసాద్, నారాయణ విమర్శించారు. వరద సాయంపై అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. సుమారు 110 రోజుల పాలనలో ఎన్ని మంచి పనులు చేశామో తెలుసుకోవాలన్నారు. ఇకనైనా బురద రాజకీయాలు మానుకొని చేస్తున్న మంచి పనులు గుర్తించాలన్నారు. సాక్షి తప్పుడు కథనాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. పదేపదే దుష్ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

"వరద సాయం కింద మొత్తం ఖర్చయింది రూ.601 కోట్లు. ఆహారానికి రూ.92.5 కోట్లు, తాగునీటికి రూ. 11.2 కోట్లు, మెడికల్ కేర్‌కు రూ.4.55 కోట్లు, పారిశుద్ధ్యానికి రూ.22.56 కోట్లు ఖర్చయింది. ఎన్టీఆర్ జిల్లాలో రూ.139.44 కోట్లు ఖర్చు పెట్టాం. వరదలతో తీవ్రంగా నష్టపోతే ఆదుకోవాల్సిందిపోయి.. విమర్శలు చేస్తారా? విపత్తు సమయంలో ఒకవైపు వరద, మరోవైపు వర్షపు నీటితో అతులాకుతమైంది. నాలుగు రోజులు నీళ్లలోనే ఉండటం వల్ల తాగునీటి సరఫరా లేదు. యుద్ధ

(మిగతా 2లో)

## ఆనందపురం మండలంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

### గృహ నిర్మాణ లేఅవుట్లు, ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ బుధవారం ఆనందపురం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. దీనిలో భాగంగా గిడిజాల, కనమాం గ్రామాల్లోని ప్రధాన మంత్రి అవాస్ యోజన గృహ నిర్మాణ లేఅవుట్లను సందర్శించారు. అక్కడ జరుగుతున్న నిర్మాణాల స్థితిగతులను పరిశీలించారు. లేఅవుట్లో ఎన్ని ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి.. ఇప్పటి వరకు పూర్తియినవి ఎన్ని, వివిధ దశల్లో ఉన్నవి ఎన్ని అనే అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. లేఅవుట్ విస్తీర్ణం, అప్రోచ్ రోడ్లు, మౌలిక వసతుల కల్పనపై ఆరా తీశారు. ఇళ్ల నమూనాలను పరిశీలించిన ఆయన లోపలికి వెళ్లి చూశారు. స్లాబ్, కిటికీలు, కాంక్రీట్ పనులను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన అక్కడి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. అందరూ బాధ్యతగా వ్యవహరించి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో ఆయన పలువురి లబ్ధిదారులతో మాట్లాడారు. వారి నుంచి అభిప్రాయాలు సేకరించారు. పర్యటనలో కలెక్టర్ వెంట గృహ నిర్మాణ శాఖ పీడీ ఆళ్ల శ్రీనివాసు, ఏడీసీ రమణమూర్తి, గృహ నిర్మాణ శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

**ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన**

మండలంలోని వివిధ రెవెన్యూ గ్రామాల పరిధిలో ఫ్రీ హెూల్డ్ చేసిన భూమలను కలెక్టర్ పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో భూములను పరిశీలించిన ఆయన పలువురు రైతులతో మాట్లాడారు. వారికి భూమి సంక్రమించిన విధానం.. తర్వాత జరిగిన పరిణామాల గురించి ఆరా తీశారు. స్థానిక రెవెన్యూ అధికారులు దగ్గరుండి భూములు ఫ్రీహెూల్డ్ జరిగిన ప్రాంతాలను చూపించారు. అక్కడి పరిస్థితులను కలెక్టర్ కు వివరించారు. స్థానిక తహశీల్దార్ శ్యామ్, ఉప తహశీల్దార్, మండల సర్వేయర్, ఇతర సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## గంజాయి అక్రమ రవాణ నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలి

### విశాఖపట్నం రేంజ్ ఎస్పీలతో జూమ్ మీటింగు నిర్వహించిన విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నం రేంజ్ పరిధిలోని అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎస్పీలతో విశాఖపట్నం రేంజ్ డిఐజి శ్రీ గోపీనాథ్ జట్టి, ఐపిఎస్ గారు అక్టోబరు 9న జూమ్ మీటింగు నిర్వహించారు.ఈ సందర్భంగా విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపినాథ్ జట్టి, మాట్లాడుతూ - రేంజ్ పరిధిలో గంజాయి అక్రమ రవాణ నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలన్నారు. రేంజ్ పరిధిలో ఎక్కడ గంజాయి సాగు జరగకుండా చూడాలని, గంజాయి పండించే రైతులు తమ జీవనోపాధికి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి సాగు, విక్రయాలు, రవాణ, వినియోగం చేయడం వలన విధించే శిక్షలు, ఎదుర్కొనే న్యాయపరమైన చిక్కులను రైతులకు వివరించాలన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రజలు, విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు 'సంకల్పం' కార్యక్రమం ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రతీ జిల్లాలో గంజాయి అక్రమ రవాణ నియంత్రణకు మరింత పటిష్టంగా డైనమిక్ వాహన తనిఖీలను ఆకస్మికంగా చేపట్టాలన్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద వాహన తనిఖీలను కుణ్ణంగా చేపట్టాలని, ఆధునిక సాంకేతికతను, స్నిఫర్ డాగ్స్ ఇప్పటికే గుర్తించిన హాట్ స్పాట్ల వద్ద తనిఖీలు చేపట్టాలన్నారు. గంజాయి అక్రమ రవాణకు తరుచూ పాల్పడే వారిపై పీడీ యాక్టును ప్రయోగించాలన్నారు. గంజాయి కేసుల్లో పరారీలో ఉన్న నిందితులను అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వారిని అరెస్టు చేయాలని జిల్లా ఎస్పీలకు రేంజ్ డిఐజి ఆదేశించారు. దీపావళి పండగ వస్తున్న నేపథ్యంలో బాణసంచా విక్రయించే షాపులు, గోడౌన్లును తనిఖీ చేసి, వారి లైసెన్సులు తనిఖీ చేయాలని, భద్రత ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అనధికారంగా బాణసంచా విక్రయాలు జరగకుండా చూడాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. బాణసంచా షాపులు, గోడౌన్లు వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా, ముందస్తు భద్రత చర్యలు చేపట్టాలని అధికారులను డిఐజి ఆదేశించారు. పేకాట స్థావరాలను గుర్తించేందుకు నిఘా పెట్టాలని, జిల్లాల్లో ఎక్కడా జూదం, క్రికెట్ బెట్టింగు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నేరాలను నియంత్రించుటలో భాగంగా ప్రతీ జిల్లాలోను క్రైం ప్రోన్ ఏరియాలను గుర్తించి, సిసి కెమెరాలను ఏర్పాటు చేసేందుకు

(మిగతా 2లో)

## (మొదటి పేజీ తరువాయిలు)

### దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

ఎంతో శ్రమించారు. ఇంద్రకీలాద్రిపై వీఐపీ భక్తులు కూడా సహకరించారు. దుర్గగుడి సన్నిధిలో సౌకర్యాలు బాగున్నాయని భక్తులు చెప్పారు. దుర్గమ్మ దయవల్ల రాష్ట్రంలో పుష్కలంగా వర్షాలు పడ్డాయి. అమ్మవారి దయతో రాష్ట్రంలో నదుల అనుసంధానం పూర్తవ్వాలి. రాష్ట్ర ప్రజలందరిపైనా దుర్గమ్మ ఆశీస్సులు ఉండాలి. ఇవాళ వచ్చే భక్తులందరికీ ఉచిత దర్శనం కల్పించారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగానే మా నిర్ణయాలు ఉంటాయి. ప్రతి దేవాలయానికి పూర్వ వైభవం వచ్చేలా కృషిచేస్తాం'' అని తెలిపారు.

### సమాజంలో కాంగ్రెస్ విషబీజాలు నాటుతోంది: ప్రధాని మోదీ

శక్తులన్నింటికీ రాబోయే ఎన్నికల్లో మహారాష్ట్ర ప్రజలు తగిన సమాధానం ఇస్తారని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రజలు భాజపా-మహాయుతి ప్రభుత్వానికి ఓటు వేయాలని కోరారు.

ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత పవన్ ఖేడా ఖండించారు. ప్రధాని రాజకీయ ప్రసంగాల కోసం ప్రభుత్వ కార్యక్రమాలను ఎందుకు ఉపయోగించుకుంటున్నారని ప్రశ్నించారు. ఇలాంటి ప్రసంగాల కోసం ప్రజల డబ్బును దుర్వినియోగం చేయకుండా భాజపా సొంత సొమ్ముతో వేదికలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

### జగన్ ఇకనైనా తప్పుడు ప్రచారాలు మానుకో: మంత్రి నారా లోకేశ్

చీకటి లెక్కలు కాదు కూటమి ప్రభుత్వానివి. మా ప్రభుత్వం లెక్కలు అన్నీ పారదర్శకంగా ఉన్నాయి. ఇందుకు సంబంధించి 'ఎక్స్'లో పోస్టు పెట్టాం. చదువు వస్తే చదువుకో.. కళ్లుంటే చూడు. తాడేపల్లి ప్యాలెస్ కలుగులో దాక్కుని ఎగ్ పఫ్‌ల పేరుతో జగన్ ప్రజాధనం రూ.కోట్లు మెక్కారు. ఫేక్ జగన్ ఇకనైనా నీ ఫేక్ ప్రచారాలు ఆపు'' అని లోకేశ్ విమర్శించారు.

### హస్తం అతివిశ్వాసం.. : ఆప్

దిల్లీలో పదేళ్లుగా ఒక్క అసెంబ్లీ సీటు గెలవని కాంగ్రెస్‌కు ఇటీవల లోక్‌సభలో మూడు సీట్లు ఇచ్చామని.. అయినప్పటికీ హరియాణా ఎన్నికల్లో మిత్రపక్షాలకు తోడుగా నిలవలేదని ఆప్ విమర్శించింది. హరియాణా ఎన్నికల్లో పొత్తుకోసం ఇండియా కూటమి చేసిన ప్రయత్నాలన్నింటినీ కాంగ్రెస్ తుంగలో తొక్కిందని మండిపడింది.

హరియాణాలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు సీట్ల పంపకాల విషయంలో కాంగ్రెస్-ఆప్‌ల మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో రెండు పార్టీలు స్వతంత్రంగా పోటీ చేసి ఓటమి చవిచూశాయి. మెజార్టీ మార్కుకు కాంగ్రెస్ దూరం కాగా.. ఆప్ అసలు ఖాతా తెరవలేదు. దాంతో హ్యాట్రిక్ విజయాన్ని భాజపా సొంతం చేసుకుంది.

### అడవివరంలో దుర్గాదేవి అమ్మ వారి ఘటాలు ఊరేగింపు

ఈ ఏడాది కూడా వినాయక చవితి, దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నవరాత్రి పూజా కార్యక్రమంలలో అధిక సంఖ్యలో భక్తులు మహిళలు పాల్గొని పూజలు చేశారన్నారు. అమ్మవారి దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఎక్కడ ఎటువంటి ఇబ్బంది లేకుండా కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.అమ్మవారి కరుణా కటాక్షాలు అందరితోపాటు తన కుటుంబంపై కూడా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

### ప్రభుత్వం ఇన్ని పనులు చేస్తే జగన్‌కు కనిపించలేదా?.. ఏపీ మంత్రులు మండిపాటు

ప్రాతిపదికన నీళ్లు ఇచ్చాం.

ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి కాబట్టే సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు మాకు ఆదేశాలిచ్చారు. పాలు, బిస్కెట్లు ఇలా అన్నిరకాల వస్తువులు బాధితులకు వెంటనే అందజేశాం. పారిశుద్ధ్య నిర్వహణ కోసం బయట ప్రాంతాల నుంచి 7 వేల మందిని పిలిపించాం. మున్సిపల్ కార్పొరేషన్ నుంచి 3 వేల మంది పనిచేశారు. మొత్తం 10 వేల మంది నిద్రాహారాలు మానుకొని రాత్రింబవళ్లు కష్టపడ్డారు. రోడ్లు, ఇళ్లలో పేరుకున్న బురదను ఫైరింజిన్ల ద్వారా శుభ్రం చేయించాం. ప్రభుత్వం ఇన్ని పనులు చేస్తే జగన్‌కు కనిపించలేదా? పేపర్ ఉందని.. నోటికొచ్చినట్లు సాక్షిలో అవాస్తవాలు రాస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు'' అని మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

### గంజాయి అక్రమ రవాణ నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలి

ప్రతిపాదనలు పంపాలన్నారు. ఏ తరహా నేరం జరిగినా సిసి కెమెరాల్లో నేరానికి సంబంధించిన వీడియోలు నిక్షిప్తమయ్యే విధంగా చర్యలు చేపట్టాలని, అందుకు అవసరమైన సిసి కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలను సిద్ధం చేసి, పంపాలన్నారు. సైబరు నేరాలను నియంత్రించుటలో భాగంగా ప్రజలకు సైబరు మోసాలు పట్ల అవగాహన కల్పించాలన్నారు. డిజిటల్ అరెస్టు పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రజలకు సైబరు మోసాలకు గురికాకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సైబరు మోసానికి గురైతే 1930కు ఫిర్యాదు చేసే విధంగా చూడాలని, గతంలో నమోదైన సైబరు కేసుల్లో బ్యాంకు అకౌంట్లలో ఫ్రీజ్ అయిన నగదు బాధితులకు తిరిగి చేరే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. దర్యాప్తులో ఉన్న హత్య కేసులు, లాంగ్ పెండింగు కేసులను, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు సంబంధించి నమోదైన రేప్, వరకట్న మరణాలు, పోక్సో కేసులను రేంజ్ డిఐజి సమీక్షించి, దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేయాలని, నిందితులు న్యాయస్థానాల్లో శిక్షింపబడే విధంగా సాక్ష్యాలను, సాంకేతిక ఆధారాలను సేకరించే విధంగా దర్యాప్తు అధికారులు చర్యలు చేపట్టే విధంగా చూడాలని జిల్లా ఎస్పీలను ఆదేశించారు. అదే విధంగా బాలికలు, బాలుర అదృశ్యం కేసుల్లో అలసత్వం వహించకుండా, కేసు నమోదైన వెంటనే వారిని అచూకీ కనిపెట్టేందుకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలని జిల్లాల ఎస్పీలను విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి ఆదేశించారు.ఈ జూమ్ కాన్ఫరెన్సులో అనకాపల్లి జిల్లా ఎస్పీ ఎం. దీపిక, ఎ.ఎస్.ఆర్. జిల్లా ఎస్పీ అమిత్ బర?ర్, విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కే.వి.మహేశ్వర రెడ్డి, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి పాల్గొన్నారు.

## విశాఖ వేదికగా ప్రారంభమైన మారిటైం ఎక్సైజ్ మలబార్ 2024




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మారిటైం ఎక్సైజ్ మలబార్ 2024 సముద్ర విన్యాసాలు బుధవారం ఉదయం తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. తూర్పు నావికాదళం లోని విశాఖపట్నం వేదికగా అక్టోబర్ 9 నుండి 18 వరకు నిర్వహించనున్న మారిటైం ఎక్సైజ్ మలబార్ 2024 18వ ఎడిషన్ లో భారతదేశంతోపాటు ఆస్ట్రేలియా, జపాన్, అమెరికా నావికా దళాలు పాల్గొంటున్నాయి. సముద్ర విన్యాసాల ప్రారంభం సందర్భంగా ఐఎన్ఎస్ సత్పురలో నిర్వహించిన మీడియా సమావేశంలో తూర్పు నావికాదళ కమాండింగ్ ఆఫీసర్ ఇన్ చీఫ్ రాజేష్ పెందర్కర్ మాట్లాడుతూ మలబార్ విన్యాసం అనేది ఒక చతుర్భుజ ఆకృతిలో జరిగే నావికా విన్యాసం అని ఇందులో అమెరికా సంయుక్త రాష్ట్రాలు, జపాన్, ఆస్ట్రేలియా భారతదేశం శాశ్వత భాగస్వాములుగా ఉన్నాయని అన్నారు. 1992లో భారత అమెరికాల మధ్య ద్వైపాక్షిక కసరత్తుగా ప్రారంభమైన ఈ వ్యాయామం తర్వాత జపాన్ 2015 లో శాశ్వత భాగస్వామిగా చేరిందని అన్నారు. అనంతరం యుఎస్ పసిఫిక్ ఫ్లీట్ కమాండర్ అడ్మిరల్ స్టీఫెన్ కోహ్లర్, మాట్లాడుతూ ఇలాంటి విన్యాసాలు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపరచడానికి ఉగ్రవాదం లేకుండా ప్రపంచశాంతికి దోహదపడతాయని గత 28 సంవత్సరాలుగా ఈ విన్యాసాల ద్వారా ఇరుదేశాల మధ్య సోదర భావం పెరిగి శాంతి సామరస్యంతో ముందుకు వెళుతున్నామని అన్నారు. చీఫ్ ఆఫ్ స్టాఫ్, జాయింట్ స్టాఫ్, జపాన్ జనరల్ యోషిహిడే యోషిడా మాట్లాడుతూ... ఈ విన్యాసం ద్వారా తమ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని శాశ్వత సభ్యతను అందించేందుకు కృషి చేస్తున్నామని ప్రపంచంలోనే అతిపెద్ద సముద్రభాగం ఇండో పసిఫిక్ సముద్ర ప్రాంతమని, ఈ ప్రాంతంలో సముద్ర సంపదను కాపాడుకునేందుకు ఈ విన్యాసాలు ఎంతగానో ఉపయోగపడతాయని, అదేవిధంగా శత్రు దేశాలు సముద్ర దాడులకు పాల్పడకుండా ఎదుర్కొనేందుకు శక్తివంతమైన నావిక దళాలు అన్ని ఒకచోట చేరి తమ ఆయుధ సంపత్తిని ప్రదర్శించడం గొప్ప విషయం అని అన్నారు. చివరిగా ఆస్ట్రేలియన్ ఫ్లీట్ కమాండర్ స్మిత్ క్రిస్ మాట్లాడుతూ సాంకేతిక రక్షణకు కావలసిన అన్ని చర్యలు ఈ విన్యాసాల ద్వారా తీసుకోవడం జరుగుతుందని గత ఏడాది ఈ వేడుకలకు ఆస్ట్రేలియా ఆతిథ్యమిచ్చిందని ఈ ఏడాది భారతదేశంలో నిర్వహించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ విన్యాసాల్లో భారత నావికా దళం గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్లు, మల్టీ పర్పస్ ఫ్రిగేట్లు, జలాంతర్గాములు, ఫిక్స్ వింగ్ ఎంఆర్, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లతో పాల్గొంటుండగా , ఆస్ట్రేలియా నావికాదళం ఎంహెచ్ - 60ఆర్ హెలికాప్టర్ , పి 8 మారిటైమ్ పెట్రోలింగ్ ఎయిర్ క్రాఫ్ట్ , అన్జాక్ క్లాస్ ఫ్రిగేట్ అయిన హెచ్ ఎంఎఎస్ స్టువర్ట్ లతో పాల్గంటుంది. అదేవిధంగా యునైటెడ్ స్టేట్స్ నేవీ తన సమగ్ర హెలికాప్టర్లు , పి 8 మారిటైమ్ పెట్రోలింగ్ ఎయిర్ క్రాఫ్ట్ , ఆర్లీ బర్క్ క్లాస్ డిస్ట్రాయర్ యుఎస్ఎస్ డ్యూయ్‌ను రంగంలోకి దించనుంది, జపాన్ నేవీ మురాసామే క్లాస్ డిస్ట్రాయర్ జెఎస్ అరియాకేతో కలిసి ఈ విన్యాసాల్లో పాల్గొంటుంది ఈ వ్యాయామంలో భాగంగా సబ్జెక్ట్ మేటర్ , ఎక్స్చేంజ్, ఉపరితలం, గగనతలంపై ప్రత్యేక ఆపరేషన్ల , యాంటీ సబ్ మెరైన్ వార్ఫైర్స్ దేశాల మధ్య సహకారం కొరకు చర్చలు, కార్యాచరణ సామర్థ్యాలు పెంపొందించుకోవడానికి విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించబడతాయని వారు తెలిపారు. హార్బర్ ఫేజ్ ను అక్టోబర్ 9 నుండి 12 వరకు నాలుగు రోజులు జరుగుతందని , అనంతరం సి ఫేజ్ ప్రారంభం అవుతందని ఈ విన్యాసాల ముగింపు ఈ నెల 18 న జరుగుతుందని తెలిపారు.

## తల్లుల ఆరోగ్యం, కుటుంబ నియంత్రణ అంశాలలో భారత్ నాయకత్వానికి యూఎన్ఎఫ్‌పీఏ ప్రశంస

**విజయవాడ, (పీఐబీ):** తల్లుల ఆరోగ్యం, కుటుంబ నియంత్రణ అంశాల్లో భారతదేశం సాధించిన ప్రగతిని యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ (యుఎన్ఎఫ్‌పిఏ) ప్రశంసించింది. కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి శ్రీమతి పుణ్య సలీల వాస్తవకు ప్రశంస పూర్వక బహుమతితో పాటు ధ్రువపత్రాన్ని యుఎన్ఎఫ్‌పీఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ నటాలియా కానెమ్ అందజేశారు. అనంతరం ఆమెను సత్కరించారు. మహిళల ఆరోగ్యానికి సంబంధించి భారతదేశంతో కలిసిపని చేయడానికి ఆసక్తితో ఉన్నట్లు యుఎన్ఎఫ్‌పిఏ స్పష్టం చేసింది.

తల్లుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అనేక కార్యక్రమాలను అమలు చేస్తూ, ప్రసూతి పరమైన మరణాలను నివారించడంలో సున్నా స్థాయి లక్ష్యాన్ని సాధించడానికి పాటుపడుతున్నది. ఈ కార్యక్రమాలలో 'సురక్షిత్ మాతృత్వ్ ఆశ్వాసన్ యోజన' (ఎస్‌యూఎమ్ఎఎన్), 'ప్రధాన్ మంత్రి సురక్షిత్ మాతృత్వ్ అభియాన్' (పిఎమ్ఎస్ఎమ్ఏ)లతో పాటు 'ప్రసూతి వైద్య సేవల కార్యక్రమం'ల పరిధులలో నాణ్యమైన, గౌరవాన్విత మాతృత్వ సంరక్షణ సేవలను అందిస్తున్నారు.

నేషనల్ హెల్త్ మిషన్ అదనపు కార్యదర్శి, మిషన్ డైరెక్టర్ శ్రీమతి ఆరాధన పట్ నాయక్‌బీ రీప్రొడక్టివ్, చైల్డ్ హెల్త్ (ఆర్‌సీహెచ్) సంయుక్త కార్యదర్శి శ్రీమతి మీరా శ్రీవాస్తవబీ యుఎన్ఎఫ్‌పీఏ ఆసియా పసిఫిక్ ప్రాంతం డైరెక్టర్ శ్రీ పియో స్మిత్‌బీ యుఎన్ఎఫ్‌పీఏలో భారతదేశం ప్రతినిధి ఆండ్రియా ఎమ్. వోజ్‌నార్ లు కూడా పాల్గొన్న కార్యక్రమంలో, యుఎన్ఎఫ్‌పీఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ నటాలియా కానెమ్ మాట్లాడుతూ 2000 సంవత్సరం నాటి నుంచి 2020వ సంవత్సరం మధ్య కాలంలో మాతృ మృత్యు నిష్పత్తి (ఎమ్ఎమ్ఆర్)ను చెప్పుకోదగ్గ స్థాయిలో 70 శాతం మేర తగ్గించడంలో భారతదేశం మహత్తర కృషిని చేసిందంటూ ప్రశంసించారు. దీనితో 2030వ సంవత్సరానికన్నా ముందే 70కి లోపు ఎమ్ఎమ్ఆర్ ను చేరుకోవాలన్న స్థిరాభివృద్ధి లక్ష్యం (ఎస్‌డిజి) దిశలో దేశాన్ని నడుపుతూ ఉన్నారని ఆమె అన్నారు. ఈ ప్రశంసనీయ ప్రగతి మూలంగా దేశం నలుమూలల, మరీ ముఖ్యంగా సమాజంలో ఆదరణకు నోచుకోకుండా దూరంగా ఉండిపోయిన సముదాయాలకు చెందిన, వేల కొద్దీ మహిళల ప్రాణాలను కాపాడినట్లు అయిందని డాక్టర్ నతాలియా కానెమ్ అన్నారు.

మొత్తం కాన్పు రేటు (టిఎఫ్ఆర్-2) పరంగా చూసినప్పుడు ఇది రీప్లేస్‌మెంట్ స్థాయి కన్నా దిగువకు క్షీణించడంతో, భారతదేశ కుటుంబ నియంత్రణ కార్యక్రమం సరికొత్త శిఖర స్థాయిలకు చేరుకొంది. గత కొన్నేళ్ళుగా, సంతాన నిరోధక ఎంపికల ప్రత్యామ్నాయాల పరిధిని విస్తరించడంలో యుఎన్ఎఫ్‌పీఏ ఒక కీలక పాత్రను పోషించింది. ఈ సహకారంలో ఇటీవలే సబ్ డెర్మల్ ఇంప్లాంట్స్ తో పాటుగా డిపో మీడ్రాక్సీప్రొజెస్టిరాన్ ఎసిటేట్ (డీఎమ్‌పీఏ) అనే సూదిమందులను అందించడం కూడా ఒక భాగంగా ఉంది.

ప్రపంచంలోని పునరుత్పత్తి సంబంధిత ఆరోగ్య వేదికలలో భారత ఆరోగ్య. కుటుంబ సంక్షేమ శాఖ నాయకత్వానికి గుర్తింపు లభించింది. ఎలాగంటే ద పార్ట్‌నర్‌షిప్ ఫర్ మెటర్నల్, న్యూబార్న్ , చైల్డ్ హెల్త్ (పీఎమ్ఎన్‌సీహెచ్)లోను, ఫ్యామిలీ ప్లానింగ్ 2030లోను ప్రపంచ భాగస్వామ్య వేదికలలో కీలక స్థానాలను భారతదేశం నిర్వహిస్తున్నది.

## పండగలాంటి వార్త అంటే ఇది కదా.. పేదలకు ప్రధాని మోదీ శుభవార్త



పేదలకు దసరా కానుక గుడ్‌న్యూస్ అందించింది కేంద్ర ప్రభుత్వం. దేశంలోని 80 కోట్ల మందికిపైగా ఉన్న పేదలకు రేషన్ ద్వారా ఉచితంగా పంపిణీ చేసే ఫోర్టిఫైడ్ బియ్యాన్ని మరో నాలుగేళ్ల పాటు కొనసాగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది కేంద్ర కేబినెట్. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం సమావేశమైంది. ఈ సమావేశంలో పలు కీలక సంక్షేమ పథకాలపై నిర్ణయం తీసుకున్నారు. పీఎం గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద పేదలకు ఉచిత ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేస్తోంది కేంద్రం. ఈ పథకాన్ని జులై 2024 నుంచి డిసెంబర్ 2028 వరకు కొనసాగిస్తున్నట్టు కీలక ప్రకటన చేసింది. పిఎమ్‌జికెఎవై పథకం ద్వారా రూ. 17,082 కోట్లతో ఫోర్టిఫైడ్ రైస్ సరఫరా చేస్తోంది కేంద్ర ప్రభుత్వం. ఐసీడీఎస్, పీఎం పోషన్ సహా అన్ని పథకాల ద్వారా ఫోర్టిఫైడ్ రైస్ సరఫరా అవుతోంది. రక్తహీనత, శరీరంలో మైక్రో-న్యూట్రియంట్ల కొరతను అధిగమించడమే లక్ష్యం కేంద్ర ప్రభుత్వం ఈ పథకం అందుబాటులోకి తెచ్చింది. పూర్తిగా 100 శాతం కేంద్ర నిధులతోనే అమలవుతున్న ఈ పథకం కింద ప్రతినెలా 5 కిలోల ఫోర్టిఫైడ్ రైస్‌ను సబ్సిడీపై పంపిణీ చేస్తారు.

ఏప్రిల్ 2022లో, ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ(సీసీఈఏ) మార్చి 2024 నాటికి దశలవారీగా దేశవ్యాప్తంగా ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేసే కార్యక్రమాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. మూడు దశలు విజయవంతంగా పూర్తయ్యాయని, మార్చి నాటికి ప్రభుత్వ పథకాలన్నింటిలో ఫోర్టిఫైడ్ బియ్యాన్ని సరఫరా చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రివర్గం తెలిపింది. దేశంలో పోషకాహార భద్రత ఆవశ్యకతపై 75వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ చేసిన ప్రసంగానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. రక్తహీనతను పరిష్కరించడానికి టార్గెటెడ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్(టీపీడీఎస్), ఇతర సంక్షేమ పథకాలు, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీస్(ఐసీడీఎస్), పీఎం పోషణ వంటి కార్యక్రమాల ద్వారా ఫోర్టిఫైడ్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నామన్నారు.

గురువారం 10 -10-2024
క్రోధి నామ సంవత్సరము
దక్షిణాయణం,శరదృతువు
ఆశ్వయుజ మాసం

**పంచాంగం**

| | |
|---|---|
| తిథి | : శు. సప్తమి ఉ. 07.18 త. అష్టమి |
| నక్షత్రం | : పూర్వాషాఢ రా. 01.41 |
| వర్జ్యం | : ప. 11.09 ల 12.46 |

## ఎనిమిదో రోజు- దుర్గాదేవి



**శ్లోకం: సర్వ మంగళ మాంగల్యే శివే సర్వార్థ సాధికే, శరణ్యే త్ర్యంబకే గౌరి నారాయణి నమోస్తుతే.**

దుర్గతులను నివారించే పరాశక్తి దుర్గాదేవిగా దర్శనమిస్తుంది. ఈ అవతారంలో దుర్గముడనే రాక్షసుడిని అమ్మవారు సంహరించినట్లు పురాణాలు చెబుతున్నాయి. పంచ ప్రకృతి మహాస్వరూపాల్లో మొదటిది దుర్గారూపం. భవబంధాలలో చిక్కుకున్న మానవుడిని అనుగ్రహించి మోక్షాన్ని ప్రసాదించే మాత. కోటి సూర్యప్రభలతో వెలిగొందే అమ్మను అర్చిస్తే శత్రుపీడనం తొలగిపోతుంది. సర్వత్రా విజయం ప్రాప్తిస్తుంది. ఎర్రని వస్త్రం సమర్పించి, ఎర్రటి అక్షతలు, ఎర్రటి పుష్పాలతో అమ్మను పూజించాలి.

## హరియాణాలో 'హ్యాట్రిక్' విజయం.. ఎన్డీయేకు శుభసూచికం: చంద్రబాబు



**విజయవాడ:** హరియాణాలో భాజపా హ్యాట్రిక్ విజయం ఎన్డీయేకు శుభసూచికమని తెదేపా అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రధాని మోదీపై నమ్మకం ఉంచిన ప్రజలు.. సుస్థిరత, అభివృద్ధికే ఓటేశారన్నారు. అటు జమ్మూకశ్మీర్‌లోనూ బలమైన పార్టీగా భాజపా ఎదిగిందన్నారు. భాజపాకు ఓట్ల శాతం బాగా పెరిగిందని చెప్పారు. మంచి పనులు చేసే ప్రభుత్వాలను ప్రజలు ఆదరిస్తారని చెప్పారు. మహారాష్ట్ర, ఝార?ండ్‌లోనూ ఎన్డీయేకు మంచి ఫలితాలు వస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడారు.

జమిలి ఎన్నికలకు దేశమంతా సంపూర్ణ మద్దతు తెలపాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. దేశంలో సుస్థిర పాలన ఉంటే అభివృద్ధి వేగవంతమవుతుందన్నారు. రాష్ట్రానికి అతిపెద్ద అరిష్టం జగన్ అని దుయ్యబట్టారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఎట్టిపరిస్థితుల్లో ప్రైవేటుపరంకాకుండా అడ్డుకుంటామని స్పష్టంచేశారు. "ఏటా ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు రావడం వల్ల అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుంది. పార్లమెంటు, అసెంబ్లీ, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే బాగుంటుంది. అన్నింటికీ ఒకేసారి ఎన్నికలు జరిగితే అభివృద్ధిపై దృష్టిసారించవచ్చు. ఇతర దేశాల్లో వృద్ధుల సమస్య పెరుగుతోంది. యువత.. మన దేశానికి గొప్ప బలం. విధ్వంసకర పాలన వల్ల రాష్ట్రం ఎలా ధ్వంసమైందో గత ఐదేళ్లలో చూశాం. సుపరిపాలన వల్ల వచ్చే లాభాలను ప్రజలు చూశారు గనకే హరియాణాలో మూడోసారి భాజపా అధికారంలోకి వచ్చింది. భాజపా అగ్రనాయకత్వం పనిచేసే విధానం వల్ల హరియాణాలో గెలిచారు'' అన్నారు.

## నూకాంబిక ఆలయంలో ఘనంగా ఊంజల సేవ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెంలో వెలిసిన శ్రీ నూకాంబిక అమ్మవారి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు భాగంగా అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహించారు. సరస్వతి పూజ నిర్వహించి విద్యార్థులు విద్యార్థినులకు శ్రీ వైష్ణవి టీవీ టెక్నో స్కూల్ సాకారంతో పుస్తకాలు దాడి జేవియర్ పంపిణీ చేశారు.ఉచిత భోజనం విరాళా దాతలు కాండ్రేగుల నూక అప్పారావు పరదేశమ్మ, కాండ్రేగుల నాయుడు భాగ్యశ్రీ, కాండ్రేగుల కుమార్ రాజా మాధవి దంపతులు సహకారంతో భక్తులకు అన్న సమారాధన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎన్ సుజాత,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ సమాచారమ్
గురువారం 10-10-2024

# అసలైన నేత

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి కాషాయ దుస్తులు ధరిస్తారని చాలా మంది అనుకుంటారు.

అందుకే అక్కడ "సన్యాసి" (సర్వసంఘపరిత్యాగి) ఉన్నాడు.

స్వచ్ఛందరిటైర్మెంట్ తర్వాత అజయ్ మోహన్ బిష్త్ (ఇది అసలు పేరు). యోగి ఆదిత్యనాథ్.

HNB గర్వాల్ విశ్వవిద్యాలయం నుండి ఉత్తర ప్రదేశ్ చరిత్రలో అత్యధిక మార్కులు (100%)

యోగి జీ గణిత విద్యార్థి, అతను B.Sc గణితం బంగారు పతకంతో ఉత్తీర్ణత సాధించాడు.

1972లో UPలోని వెనుకబడిన పంచూర్ గ్రామంలో చాలా పేద కుటుంబంలో జన్మించారు. అతనికి ఇప్పుడు 50 ఏళ్లు.

అతను భారతీయ సైన్యంలోని పురాతన గూరా రెజిమెంట్ యొక్క ఆధ్యాత్మిక గురువు. యోగిజీని గురువుగా ఆరాధించే యోగి మద్దతుదారుల భారీ సమూహం నేపాల్‌లో ఉంది.

మార్షల్ ఆర్ట్స్ (మల్లయుద్ధం) లో అద్భుతమైన నైపుణ్యం. ఏక కాలంలో నలుగురిని ఓడించిన రికార్డు.

ఉత్తరప్రదేశ్ ప్రఖ్యాత స్విమ్మర్. ఎన్నో పెద్ద నదులను దాటిన ఖ్యాతిని పొందారు.

కంప్యూటర్‌ను కూడా ఓడించే అకౌంటింగ్ నిపుణుడు. ప్రముఖ గణిత శాస్త్రవేత్త శకుంతలాదేవి కూడా యోగిజీని ప్రశంసించారు.

రాత్రిపూట కేవలం నాలుగు గంటల నిద్ర. అతను ప్రతిరోజు ఉదయం 3:30 గంటలకు లేస్తాడు.

యోగా, ధ్యానం, గౌశల, హారతి, పూజ దినచర్య.

రోజుకు రెండు సార్లు మాత్రమే తినడం... పూర్తిగా శాఖాహారం. ఆహారంలో దుంపలు, వేర్లు, పండ్లు మరియు దేశీయ ఆవు పాలు ఉంటాయి.

అతను ఇప్పటి వరకు ఏ కారణం చేత ఆసుపత్రిలో చేరలేదు.

యోగి ఆదిత్యనాథ్ ఆసియాలోని అత్యుత్తమ వన్యప్రాణి శిక్షకులలో ఒకరు, అతనికి వన్యప్రాణులంటే చాలా ఇష్టం.

యోగి కుటుంబం ఎంపీ లేదా ముఖ్యమంత్రి కాకముందు ఎలాంటి స్థితిలో ఉందో ఇప్పటికీ అలాగే జీవిస్తోంది.

సంవత్సరాల క్రితం స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్న తర్వాత యోగి ఒక్కసారి మాత్రమే ఇంటికి వెళ్లారు.

యోగికి ఒకే బ్యాంకు ఖాతా ఉంది మరియు అతని పేరు మీద భూమి ఆస్తి లేదు లేదా అతనికి ఎటువంటి ఖర్చులు లేవు.

వారు తమ సొంత జీతం నుండి వారి ఆహారం మరియు బట్టలు ఖర్చు చేస్తారు మరియు మిగిలిన డబ్బును సహాయ నిధిలో జమ చేస్తారు.

ఇది యోగి ఆదిత్యనాథ్ ప్రొఫైల్...

భారతదేశంలో నిజమైన నాయకుడి ప్రొఫైల్ ఇలా ఉండాలి.

అలాంటి పుణ్యాత్ములు మాత్రమే భారతదేశాన్ని మళ్లీ ప్రపంచ గురువుగా మార్చగలరు.

## భద్రకాళి అవతారంలో దర్శనమిచ్చిన శ్రీ గౌరీ పరమేశ్వరి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక గవరపాలెం శ్రీ గౌరీ పంచాయతన దేవాలయంలో శ్రీదేవి నవరాత్రి మహోత్సవాలు భాగంగా బుధవారం అర్చకులు.అంపోలు గోపాల కృష్ణ శర్మ , అంపోలు రాంప్రసాద్ శర్మ, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు భ శ్రీ భద్రకాళి దేవిగా అమ్మవారి గా భక్తులకు దర్శనమిచ్చారు ఆలయ మండపంలో సాముహిక మహిళలచే సహస్రనామ పూజ నిర్బీజపూజ(కిస్ మిస్) ఫలాలతో అర్చన

నిర్వహించారు.భక్తులు అమ్మవారి దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో

ఆలయ అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ , ఆళ్ళ మహాలక్ష్మి నాయుడు, మళ్ల సురేష్, యల్లపు వెంకటరమణ, ఆళ్ల ప్రసాద్ మరియు పాలకవర్గ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడం జరిగింది.


**దక్షిణ మధ్య రైల్వే**

దక్షిణ మధ్య రైల్వే యొక్క టెండరు నోటీసులలోని వివరములు మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.in నందు కూడా చూడవచ్చును.

**ప్రకటన నోటీస్ నెం. 02/2024/ఎస్‌టిబిఎ/బిజెడ్ఎ**
**తేది: 07-10-2024**

PUB/1001

భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్, విజయవాడ వారు భారత పౌరులు/18 సంవత్సరములు వయస్సు నిండిన జాతీయుల నుండి స్టేషన్ టిక్కెట్ బుకింగ్ ఏజెంట్ (ఎస్‌టిబిఎ) పథకం క్రింద 08ఎన్ఎస్‌జి-6 కేటగిరి రైల్వే స్టేషన్ల వద్ద విజయవాడ డివిజన్ యందు దిగువ తెలిపిన ప్రదేశములలో అన్ రిజర్వ్డ్ టిక్కెట్లను అన్ రిజర్వ్డ్ టికెటింగ్ సిస్టం (యుటిఎస్) కమిషన్ పద్ధతిపై ఆయా స్టేషన్ల వద్ద ప్రస్తుతం ఉన్న కౌంటర్ల వద్ద నియమించుట కొరకు దరఖాస్తులు సీల్డు దరఖాస్తు ఆహ్వానిస్తున్నారు. దరఖాస్తుదారు దిగువ తెలిపిన రైల్వే స్టేషన్ల లొకేషన్ గల జిల్లా నివాసి అయి ఉండవలెను. నియామక కాలపరిమితి మూడు (03) సంవత్సరముల పాటు కేటాయింపు అనంతరం కొనసాగును.

| పని వివరణ | ఎంగేజ్‌మెంట్ కాల పరిమితి | ధరావత్తు | టెండరు ఫారం వెల | టెండరు దాఖలు చేయు తేది |
|---|---|---|---|---|
| పని స్వభావము : విజయవాడ డివిజన్ యందు ఎనిమిది (08) ఎన్ఎస్‌జి-6 కేటగిరి స్టేషన్ల వద్ద ప్రస్తుతం గల బుకింగ్ కౌంటర్ల వద్ద అన్‌రిజర్వ్డ్ టిక్కెట్లతో ప్రజలు ప్రయాణించుటకు జారీ చేయుట. | మూడు (03) సంవత్సరాలు | ఎన్ఎస్‌జి-6- రూ. 2,000 | ఉచితం | 08-11-2024 గం. 10 గంటల నుండి 15 గంటల వరకు |

ఎస్‌టిబిఎలను ఎంగేజ్‌మెంట్ చేయు స్టేషన్ల జాబితా

| వ.నెం. | స్టేషన్ పేరు | కోడ్ | కేటగిరి |
|---|---|---|---|
| 1 | అమ్మనబ్రోలు | ఎఎన్‌బి | ఎన్ఎస్‌జి-6 |
| 2 | గుల్లిపడు | జిఎల్‌యు | ఎన్ఎస్‌జి-6 |
| 3 | ఇందుపల్లి | ఐడిపి | ఎన్ఎస్‌జి-6 |
| 4 | కడియం | కెవైఎం | ఎన్ఎస్‌జి-6 |
| 5 | మునుబోలు | ఎంబిఎల్ | ఎన్ఎస్‌జి-6 |
| 6 | రేగుపాలెం | ఆర్‌ఇజి | ఎన్ఎస్‌జి-6 |
| 7 | తెట్టు | టిటియు | ఎన్ఎస్‌జి-6 |
| 8 | త్సుందూరు | టిఎస్ఆర్ | ఎన్ఎస్‌జి-6 |

| | |
|---|---|
| ఎస్‌సి రైల్వే వెబ్‌సైట్ నుండి టెండరు ఫారంకు డౌన్‌లోడింగ్ చేయుట. | 09-10-2024 |
| టెండరు ఫారం దాఖలు చేయు తేదీ మరియు సమయం | 08-11-2024 గం. 10.00 గంటల నుండి 08-11-2024 15.00ల వరకు |
| టెండరు బాక్సు ముగించు తేదీ మరియు సమయం | 08-11-2024 గం. 15.00లకు |
| టెండరు బాక్సు తెరచు తేదీ మరియు సమయం | 08-11-2024 గం. 15.30లకు |

సీలువేసిన టెండరు ఫారంలను సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వారి కార్యాలయము డిఆర్ఎం కార్యాలయముల సముదాయము, నార్త్ బ్లాక్ విజయవాడ-520001 యందు ఉంచబడిన టెండరు బాక్సునందు ధరావత్తుతో సహా వేయవలెను.
టెండరు ఫారములు మరియు ఇతర వివరములు దక్షిణ మధ్య రైల్వే యొక్క వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in నుండి పొందవచ్చును. ఏదైనా ఇతర వివరములకు దిగువ సంతకం చేసిన వారి వద్ద నుండి కార్యాలయ పనివేళలలో సంప్రదించవచ్చును.

A1280 ఎస్ఆర్. డివిజనల్ కమర్షియల్ మేనేజర్, విజయవాడ


## హరికేన్‌లోకి దూసుకెళ్లిన విమానం



అమెరికాలోని ఫ్లోరిడా హరికేన్ 'మిల్టన్' ప్రభావంతో వణుకుతోంది. అయితే నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్‌కు చెందిన ఓ పరిశోధన విమానం ప్రమాదవశాత్తూ హరికేన్‌లోకి దూసుకెళ్లింది. ఈ వీడియోను ఎన్ఓఏఏ సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్‌గా మారింది.

హరికేన్ ప్రభావిత ప్రాంతంలో భారీ వర్షం కురుస్తున్న సమయంలో 'మిస్ పిగ్గీ' లాక్‌హీడ్ WP-3D ఓరియన్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రమాదవశాత్తూ హరికేన్‌లోకి దూసుకుపోయింది. ఈ ఘటన సమయంలో విమానంలో నలుగురు పరిశోధకులు ఉన్నట్లు ఎన్ఓఏఏ వెల్లడించింది. తుపాను ధాటికి విమానం తీవ్ర కుదుపులకు గురవడంతో వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడిపోయాయి.

పరిశోధకులు తీవ్రంగా శ్రమించి విమానాన్ని మరోవైపు తీసుకువెళ్లడంతో ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోంది. ఈనేపథ్యంలో ఎయిర్‌క్రాఫ్ట్ ఆపరేషన్స్ సెంటర్ పబ్లిక్ అఫైర్స్ స్పెషలిస్ట్ జోనాథన్ షానన్ మాట్లాడుతూ.. "మా NOAA WP-3D ఓరియన్ విమానం దాదాపు 50 సంవత్సరాలుగా తుఫాన్లను తట్టుకుంటూ ప్రయాణిస్తుంది" అని పేర్కొన్నారు.

కాగా హరికేన్ 'మిల్టన్' ప్రభావంతో ఫ్లోరిడాలో గంటకు 290 కిలోమీటర్ల వేగంతో ప్రచండగాలులు వీస్తున్నాయి. దీనిని ఇప్పటికే కేటగిరి 5గా ప్రకటించిన అధికారులు.. సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని పౌరులకు సూచించారు. తుపానుపై అధ్యక్షుడు జోబైడెన్ మాట్లాడుతూ వందేళ్లలో అమెరికా ఎదుర్కొన్న అత్యంత ప్రమాదకర తుపాన్లలో ఇదీ ఒకటి కావొచ్చని భావిస్తున్నామన్నారు.

## గృహనిర్మాణశాఖ ప్రగతిపై కలెక్టర్ ఆగ్రహం



**విజయనగరం:** జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారులపై కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మండలంలో రోజుకు రెండిళ్లలో కూడా స్టేజ్ కన్వర్షన్ జరగడం లేదని, లక్ష్యాల సాధనలో వెనుకబడి ఉన్నారని అసంతృప్తిని వ్యక్తం చేశారు. పనిచేయని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

జిల్లాలో గృహనిర్మాణంపై ఆ శాఖ అధికారులతో తమ ఛాంబర్‌లో బుధవారం సమీక్షించారు. వందరోజుల లక్ష్యాల సాధనపై ప్రశ్నించారు. కేవలం 6శాతం మాత్రమే ప్రగతి కనిపించడంపై అసంతృప్తి చెందారు. బిబిఎల్ స్థాయిలో ఉన్న 8,324 ఇళ్లను ఎట్టిపరిస్థితిలోనూ ఈ నెలాఖరు నాటికి బిఎల్ స్థాయికి తీసుకురావాలని స్పష్టం చేశారు. దీనిపై ఈనెల 16 నుంచి రోజువారీ ప్రగతి నివేదికలను తమకు తెలియజేయాలని పిడిని ఆదేశించారు. గతంలో రోజువారీ స్టేజ్ కన్వర్షన్ లక్ష్యం రోజుకు 5 ఇళ్లుగా ఉండేదని, ప్రస్తుతం మండలానికి రెండిళ్ల మాత్రమే కన్వర్షన్ చేయాలని లక్ష్యం పెట్టినప్పటికీ ముందుకు కదలడం లేదని అన్నారు. లక్ష్య సాధనలో వెనుకబడ్డ ఏఈలపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో జిల్లా గృహనిర్మాణశాఖ పిడి కూర్మినాయుడు, ఇఇ శ్రీనివాసరావు, డిఈలు, పాల్గొన్నారు.

# దుర్గాదేవిని దర్శించుకున్న నాగ జగదీష్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక గవరపాలెం శ్రీ పరమేశ్వరి పార్క్ జంక్షన్ లో దేవీ నవరాత్రుల సందర్భంగా జనసేన నాయకులు దూలం గోపి దుర్గాదేవిని ఏర్పాటు చేశారు .వారి ఆహ్వానం మేరకు బుధవారం మాజీ శాసన మండలి సభ్యులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు ఈరోజు ఉదయం తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి శ్రీశ్రీశ్రీ దుర్గా దేవి నీ సందర్శించి అమ్మవారికి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం దూలం గోపి నాగ జగదీష్ కు శాలువా తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మారిశెట్టి భాస్కరరావు కోట్ని రామకృష్ణ బొడ్డేడ మురళి మల్ల గణేష్ దొడ్డి జగదీష్ రామోజీ శ్యాంసుందర్ బుద్ధ భువనేశ్వరరావు విల్లూరి సత్తిబాబు దాడి వేణు పెంటకోట శివరాం విల్లూరి రమణబాబు వానపల్లి కోటేశ్వరరావు సూరిశెట్టి బల్లమ్మ బుద్ధ లక్ష్మీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా న్యాయ సేవ అధికార సంస్థలో ట్రాన్స్ జెండర్స్ కు మరియు కమ్యూనిటీ మెంబర్స్ కు న్యాయ అవగాహన సదస్సు



**విజయనగరం:** ఈరోజు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థలో ట్రాన్స్ జెండర్స్ కు మరియు కమ్యూనిటీ మెంబర్స్ కు న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి గారు శ్రీమతి కె విజయ కళ్యాణి గారు మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్ యొక్క హక్కులు వారికి ప్రభుత్వం కల్పిస్తున్నటువంటి సదుపాయాలు మరియు పథకాలు గురించి తెలియజేశారు , అలాగే న్యాయ సేవలు అధికార చట్టం గురించి వారికి తెలియజేశారు, ట్రాన్స్ జెండర్ కూడా ఉచిత న్యాయ సహాయమును అందిస్తామని తెలియజేశారు. అదేవిధంగా కమ్యూనిటీ మెంబర్స్ యొక్క హక్కులు వారికి ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి తెలియజేశారు .ఈ కార్యక్రమంలో పర్మినెంట్ లో కథాలత్ అధ్యక్షులు శ్రీ జి దుర్గయ్య గారు మాట్లాడుతూ మానవ హక్కులు మరియు మానవుల అక్రమ రవాణా బాధితులు గురించి వారి యొక్క హక్కుల గురించి మరియు వారికి ప్రభుత్వం అందిస్తున్నటువంటి పథకాలు అలాగే వారి కొరకు ఏర్పాటు చేసినటువంటి రిహాబిలేషన్ సెంటర్స్ గురించి తెలియజేశారు అలాగే శాశ్వత లోకదాలత్ యొక్క విధులు గూర్చి మరియు శాశ్వత లోక్ అదాలత్ సేవలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల మరియు సీనియర్ సిటిజన్స్ డిపార్ట్మెంట్ నుంచి హాజరైన అసిస్టెంట్ డైరెక్టర్ గారు శ్రీ జి జగదీష్ గారు మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్ యొక్క పునరావాసము మరియు వారికి అందిస్తున్నటువంటి వైద్య సదుపాయాల గురించి తెలియజేశారు ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ ఉమామహేశ్వరరావు గారు మరియు ఇతర ఎన్జీవో సంస్థలు పాల్గొన్నారు.

# సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు



**విజయనగరం:** జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. ఈ ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై తమ ఛాంబర్‌లో బుధవారం సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రాజెక్టులవారీగా సంఘాలు, ఓటర్ల జాబితా, ఎన్నికల ప్రక్రియ, చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ ఈనెల 16 ప్రారంభించి, నవంబరు 24న ముగుస్తుందని చెప్పారు. వివిధ దశల్లో చేయాల్సిన పనులను వివరించారు. విజయనగరం డివిజన్‌లో 267 సంఘాలు, పార్వతీపురం డివిజన్(బొబ్బిలి సబ్ డివిజన్)లో 30, శ్రీకాకుళం డివిజన్ (పాలకొండ సబ్‌డివిజన్)లో 75, మడ్డువలస రిజర్వాయర్ ప్రాజెక్టు పరిధిలో 15, మొత్తం 387 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని తెలిపారు. వీటిపరిధిలో 2,628 టిసిలు ఉన్నాయని తెలిపారు. ఖచ్చితమైన ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, సాగునీటి సంఘాల ఎన్నికల నోడల్ ఆఫీసర్, ఇరిగేషన్ ఇఇ ఎం.వెంకటరమణ, వివిధ ప్రాజెక్టుల డిఈలు పాల్గొన్నారు.

# అమెరికన్ కార్నర్‌ను మరింత బలోపేతం చేస్తాం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రవిశ్వవిద్యాలయంలో నెలకొల్పిన అమెరికన్ కార్నర్ సహాయంతో అమెరికాలో విశ్వవిద్యాలయాలు, విద్య విధానం, స్కాలర్‌షిప్‌లు, వీసా పొందే విధానం తదితర అంశాలపై ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణ రావు అన్నారు. బుధవారం అమెరికన్ ఎంబసీ నుంచి వచ్చిన పబ్లిక్ డిప్లమసీ ఆఫీసర్ ఎమీలియా, పబ్లిక్ ఎంగేజ్‌మెంట్ స్పెషలిస్ట్ సెంథిల్ కుమార్‌లతో కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య శశిభూషణ రావు మాట్లాడుతూ ఏయూ గ్లోబల్ వర్సిటీగా నిలుస్తోందన్నారు. ఇక్కడ 64 దేశాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యశిస్తున్నారని వివరించారు. అమెరికన్ కార్నర్‌ను మరింతి బలోపేతం చేస్తామన్నారు.

ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయ రావు మాట్లాడుతూ అమెరికన్ కార్నర్‌ను యువతకు మరింత చేరువ చేసే విధంగా పూర్తిస్థాయిలో కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. వర్సిటీలోని విభిన్న విభాగాలను భాగస్వామ్యం చేస్తూ కార్యక్రమాలను చేపడతామన్నారు. డ్యూయల్ డిగ్రీ కోర్సుల నిర్వహణ దిశగా సైతం తమకు ఆలోచన ఉందన్నారు.

అమెరికా ఎంబసీ అధికారులు ఎమీలియా, సెంథిల్ కుమార్‌లు మాట్లాడుతూ భారత్-అమెరికా సంబంధాలు, పర్యావరణ అంశాలు, రెండు దేశాలకు సంబంధించిన అంశాలపై కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. అదే విధంగా అమెరికన్ కార్నర్ నుంచి అన్ని కార్యక్రమాలు ఉచితంగానే తాము నిర్వహిస్తామన్నారు. ఏయూ ఒక ప్రత్యేకమైన స్థలమన్నారు. విశ్వవిద్యాలయం, అమెరికన్ కాన్సులేట్‌ల అనుబంధాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. అమెరికన్ దౌత్యవేత్తలతో ప్రత్యేక ప్రసంగాలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం వర్సిటీ తరపున ఎమీలియా, సెంథిల్ కుమార్‌లను సత్కరించి జ్ఞాపికను బహూకరించారు.

# కెమిస్ట్రీలో ముగ్గురికి నోబెల్ పురస్కారం




ఈ ఏడాది రసాయన శాస్త్రంలో నోబెల్ పురస్కారానికి ముగ్గురు శాస్త్రవేత్తలు ఎంపికయ్యారు. ప్రొటీన్ల డిజైన్లపై పరిశోధనలకు సంబంధించి కెమిస్ట్రీ శాస్త్రవేత్తలు డెమిస్ హసబిస్, జాన్ ఎం. జంపర్, డేవిడ్ బెకర్‌ను నోబెల్ బహుమతి వరించింది. ఈ మేరకు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది. ప్రొటీన్ స్ట్రక్చర్ ప్రిడిక్షన్‌కుగాను డెమిస్, జంపర్.. కంప్యుటేషనల్ ప్రొటీన్ డిజైన్‌కుగాను బెకర్ ఈ పురస్కారం గెలుచుకున్నారు.

ఇక గతేడాది కూడా ముగ్గురు రసాయన శాస్త్రవేత్తలు ఈ అవార్డుకు ఎంపికైన విషయం తెలిసిందే. నానో టెక్నాలజీకి సంబంధించి క్వాంటమ్ డాట్స్ అవిష్కరణ, అభివృద్ధికిగాను అమెరికాకు చెందిన శాస్త్రవేత్తలు మౌంగి బవెండి (62), లూయిస్ బ్రూస్ (80), అలెక్సీ ఎకిమోవ్ (78) నోబెల్ బహుమతి గెలుచుకున్నారు.

# జీరో స్టేజ్ క్యాన్సర్... ఈ లక్షణాలుంటే

రస్తుతం ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న అతిపెద్ద మహమ్మారులలో క్యాన్సర్ ఒకటి. ఆధునిక వైద్యశాస్త్రం ఎంత అభివృద్ధి చెందినప్పటికీ క్యాన్సర్ మహమ్మారిని సమూలంగా నిరోధించే వైద్యం ఇంకా అందుబాటులోకి రాలేదు. క్యాన్సర్ బారిన పడినవారు అనుభవించే బాధ అంతా ఇంతా కాదు. అయితే ప్రాణాలను హరించే క్యాన్సర్ ముప్పును ప్రారంభ దశలోనే గుర్తించగలిగితే క్యాన్సర్ కు చికిత్స చేసి దానిని ప్రారంభ దిశలోనే తగ్గించవచ్చు.

**జీరో స్టేజ్ లేదా ప్రీ క్యాన్సర్ కండిషన్**

క్యాన్సర్ యొక్క ప్రారంభ దిశను జీరో స్టేజ్ లేదా ప్రీ క్యాన్సర్ కండిషన్ అంటారు. అయితే ప్రారంభ క్యాన్సర్ కొన్ని లక్షణాలను మనకు చూపిస్తుంది. ఈ ప్రారంభ లక్షణాలను సకాలంలో గుర్తించగలిగి సరైన వైద్యం తీసుకుంటే క్యాన్సర్ మహమ్మారి నుండి బయటపడవచ్చు. క్యాన్సర్ శరీరంలో వృద్ధి చెందడానికి ముందు ఎటువంటి లక్షణాలను చూపిస్తుంది అనేది ప్రస్తుతం మనం తెలుసుకుందాం.

**శరీరంపై ఇవి కనిపిస్తే జాగ్రత్త**

చాలామందికి శరీరంపై ఏదైనా పుండు అకస్మాత్తుగా ఏర్పడి అది మానకుండా పెరుగుతూ ఉంటుంది. ఇది ఖచ్చితంగా క్యాన్సర్ లక్షణం అయ్యే అవకాశం ఉంది. అయితే ఇది క్యాన్సర్ లక్షణంగా గుర్తించి నిర్లక్ష్యం చేయకుండా వైద్యున్ని సంప్రదించాలి. చాలామందికి శరీరంలో ఎక్కడైనా మొటిమలాంటిది మొదలై అది శరీరంలో పెరుగుతూ కనిపిస్తుంది. ఇక ఈ పరిస్థితి ఉంటే వెంటనే అప్రమత్తమై వైద్యుడిని సంప్రదించాలి.

**విపరీతంగా బరువు తగ్గిపోతూ ఉంటే జాగ్రత్త**


చాలామందికి శరీర భాగంలో బాల్స్ లాగా కదులుతూ గడ్డలు ఏర్పడతాయి. ఇటువంటి గడ్డలను గమనిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స తీసుకోవాలి. ఇక ఎంత మంచి డైట్ తీసుకున్న కొంతమంది విపరీతంగా బరువు తగ్గిపోతూ ఉంటారు. వేగంగా బరువు తగ్గడం కూడా క్యాన్సర్ ప్రారంభ లక్షణం కావచ్చు. కాబట్టి వైద్యున్ని సంప్రదించి కచ్చితంగా చెక్ చేయించుకోవాలి.

**మలబద్ధకం, విరేచనాలు లక్షణాలు ఉంటే జాగ్రత్త**

కొంతమందికి ప్రారంభ దశ క్యాన్సర్ లక్షణాలలో భాగంగా మలబద్ధకం వేధిస్తుంది. కడుపు లేదా ప్రేవుల్లో క్యాన్సర్ ప్రారంభ దిశలో ఇటువంటి లక్షణాలు కనిపిస్తాయి. మరి కొంతమందికి ఎక్కువగా విరోచనాలు అవుతాయి. ఇలా విరోచనాలు అయినప్పటికీ కూడా కచ్చితంగా వైద్యుని సంప్రదించి చూపించుకోవాలి.

**నాలుక, నోట్లో ఇలా ఉంటే జాగ్రత్త**

కొంతమందికి నాలుక పైన తెల్లని మచ్చలు నోట్లో తెల్లని లేదా ఎర్రని మచ్చలు కనిపిస్తూ ఉంటాయి. ఇవి కూడా క్యాన్సర్ ప్రారంభ లక్షణాలు కావచ్చు. కాబట్టి వీటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి. కొంతమందికి తరచూ




నోటి పూత వేధిస్తుంది. ఈ నోటి పూత దీర్ఘకాలంగా తగ్గకుండా ఉంటే అది కూడా క్యాన్సర్ ప్రారంభ దశ కావచ్చు. కాబట్టి నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యున్ని సంప్రదించి చికిత్స చేయించుకోవాలి.

# అరటితొక్కల గొప్పదనం

చాలామంది అరటి పండులో మాత్రమే పోషకాలు ఉంటాయి అనుకుంటారు. అరటిపండు తిని అరటి తొక్కలను బయట పారేస్తూ ఉంటారు. అయితే అరటి తొక్కలో కూడా పోషకాలు ఉంటాయి. అరటి తొక్కలకు ఉన్న గొప్పతనం తెలిస్తే పొరపాటున కూడా అరటి తొక్కలను పారెయ్యరు. అసలు అరటి తొక్కలో ఉండే పోషకాలు ఏమిటి?



**అరటితొక్కలో బోలెడు పోషకాలు**

అరటిపండు లోనే కాదు అరటి తొక్క లోను మన చర్మానికి, మన శరీరానికి, మన జుట్టుకు బోలెడు మేలు చేసే పోషకాలు ఉన్నాయి. అరటి తొక్కలో కెరోటినాయిడ్లు , పాలీఫెనాల్స్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి మీ శరీరం నుంచి టాక్సిన్స్ ను బయటకు పంపించడంలో కీలక భూమిక పోషిస్తాయి. అరటిపండు తొక్కలో పొటాషియం మాంగనీస్ మెగ్నీషియం ఉంటాయి

**పళ్ళు, చర్మం మెరుపుకు అరటి తొక్క**

అరటిపండు తొక్కతో పళ్లు రుద్దుకుంటే పళ్ళ మీద ఉండే పసుపు మరకలు పోతాయి. పళ్ళు ప్రకాశవంతంగా తెల్లగా మారుతాయి. అరటిపండ్ల తొక్కలో మన చర్మానికి మేలు చేసే ఎన్నో పోషకాలు ఉంటాయి. అరటిపండు తొక్కతో ముఖం పైన మసాజ్ చేసినట్లయితే, ముఖం నిగారింపు ఉన్న సొంతం చేసుకుంటుంది. కళ్ళ కింద వాపు, నల్లటి మచ్చలు, వృద్ధాప్య సంకేతాలు ఇటువంటి వాటిని అరటిపండు తొక్క ఈజీగా పోగొడుతుంది.

**జుట్టుకు మేలు చేసే అరటితొక్కలు**

అరటిపండు తొక్కలో ఉండే హిస్టమిన్, విటమిన్ సి, విటమిన్ ఇ, లెక్టిన్, జింక్ మొటిమలు, చర్మం దురద నుంచి కాపాడుతాయి. అరటి తొక్కలు చర్మం డ్రై కాకుండా తేమగా ఉండేలా చేస్తాయి. అరటి తొక్కలను తేనే నిమ్మరసంలో మిక్స్ చేసి, అప్లై చేసుకుని పదినిమిషాల తర్వాత కడిగేస్తే ముఖం నిగారింపు ను సొంతం చేసుకుంటుంది. అరటి తొక్కలను జుట్టుకు రుద్దుకుంటే జుట్టుకు కావలసిన పోషకాలు అందుతాయి.

**అరటి తొక్కలు తింటే బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు** ఇవి మాత్రమే కాదు అరటి పండు తో పాటు తొక్కలను కూడా తింటే డయాబెటిస్, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి అనేక వ్యాధులతో పోరాడే శక్తి మనకు లభిస్తుంది. అరటిపండు తొక్కలో పీచుపదార్థాలు ఎక్కువగా ఉండటం వల్ల, అరటిపండు తొక్కలు తింటే మలబద్ధకం సమస్యలను ఇది తొలగిస్తుంది. మన శరీరంలో కొలెస్ట్రాల్ ను తగ్గించడానికి, కంటి ఆరోగ్యం మెరుగుపరచడానికి, రోగ నిరోధక శక్తిని పెంచడానికి, ఎముకలను బలంగా ఉంచడానికి, ఇలా ఒకటేమిటి అనేక విధాలుగా అరటి తొక్కలు ఉపయోగపడతాయి.

# బట్టతల ఎందుకు వస్తుందో?




ఇది బట్టతలకు అత్యంత సాధారణ కారణం. మీ కుటుంబంలో ఎవరికైనా బట్టతల ఉంటే, మీకు రావడానికి అవకాశం ఎక్కువ.టెస్టోస్టెరాన్ అనే హార్మోన్ జుట్టు రాలడానికి దోహదపడుతుంది. ఈ హార్మోన్ జుట్టు రోమాలను చిన్నవిగా, బలహీనంగా చేస్తుంది.వయసు పెరిగే కొద్దీ జుట్టు రాలడం సహజం. థైరాయిడ్ గ్రంథి సమస్యలు, అనారోగ్యకరమైన ఆహారం, లోహపు లోపాలు, తీవ్రమైన ఒత్తిడి, కొన్ని రకాల మందులు వాడటం వల్ల కూడా జుట్టు రాలవచ్చు.జుట్టును అతిగా చివర చేయడం, రంగులు వేయడం, హెయిర్ స్ట్రెయిటెనింగ్ వంటివి జుట్టును బలహీనంగా చేసి, రాలడానికి దారితీస్తాయి.తల చర్మం సమస్యలు, ఫంగస్ ఇన్ఫెక్షన్లు కూడా జుట్టు రాలడానికి కారణమవుతాయి.

**బట్టతల నివారణకు చిట్కాలు:**పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం చాలా ముఖ్యం. యోగా, ధ్యానం వంటివి చేయడం ద్వారా ఒత్తిడిని నిర్వహించుకోవచ్చు.తల చర్మాన్ని శుభ్రంగా ఉంచడం, నూనెలు పట్టడం వంటివి చేయాలి. మీరు అధికంగా జుట్టు రాలుతున్నట్లు భావిస్తే, వైద్యుడిని సంప్రదించడం ఉత్తమం.

# నట్టింట్లో కూర్చుని జుట్టు దువ్వుకుంటున్నారా?

చాలామంది ఇల్లు వాస్తు శాస్త్రం నియమాల ప్రకారం నిర్మించుకున్నామని భావించి, ఇంట్లో వాస్తు నియమాలకు విరుద్ధంగా కొన్ని పనులు చేస్తూ ఉంటారు. అవి ఆ ఇంటి గృహస్థుల జీవితాల పై ప్రతికూలమైన ప్రభావాలను చూపిస్తూ ఉంటాయి. చాలా పనులు ఇంట్లో చేయకూడదు అని చెప్పినా అవేవీ లక్ష్య పెట్టకుండా చాలామంది చేస్తూ ఉంటారు. గోళ్ళు కొరకటం, ఇంటి మధ్యలో కూర్చొని జుట్టు దువ్వుకోవడం వంటి అనేక పనులు అనేక నెగిటివ్ ఫలితాలను ఇస్తాయి. ముఖ్యంగా మహిళలు జుట్టు విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఇంటికి దరిద్రం పట్టుకుంటుంది.

మహిళలు జుట్టు విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంట్లో జుట్టు విరబోసుకొని మహిళలు ఎప్పుడు పని చేయకూడదు. జుట్టు విరబోసుకొని మహిళలు నిద్రించకూడదు. అంతేకాదు మహిళలు నటింట్లో జుట్టు దువ్వకూడదు. వెంట్రుకలు ఇంట్లో పడటం మన పెద్దవాళ్లు అశుభమని చెబుతూ ఉంటారు. అందుకే జుట్టు దువ్వుకునేటప్పుడు మహిళలు ఆరు బయట గాని, వరండాలో కానీ, ఇంటికి దూరంగా కానీ దువ్వుకోవాలి. వెంట్రుకలు నట్టింట్లో పడితే శనిదేవుని ఆహ్వానించినట్టేనని, అది ఇంట్లో ప్రతికూల వాతావరణాన్ని సృష్టిస్తుందని చెబుతారు. జుట్టు విరబోసుకుని మహిళలు ఎదురు వచ్చినా కూడా, ఆ పనులు జరగమని ప్రతికూల ఫలితాలు వస్తాయని సూచిస్తున్నారు.



**మంగళవారం జుట్టు విషయంలో ఈ పనులు చెయ్యకండి**

ఇక మంగళవారం నాడు మహిళలు జుట్టు అస్సలు కత్తిరించుకోకూడదని కూడా చెబు తున్నారు. మంగళవారం నాడు జుట్టు కత్తిరించుకోవడం, జుట్టు విరబోసుకుని తిరగడం చేస్తే అరిష్టమని చెబుతున్నారు. మంగళవారం అయితే జుట్టుని ఎక్కువగా కూడా దువ్వకూడదని, మంగళవారం జుట్టు రాలితే ఆ ఇంటికి దరిద్రం పట్టుకుంటుందని చెబుతున్నారు. నటింట్లో కూర్చొని తల దువ్వుకోవడం, నటింట్లో కూర్చొని పేలు చూసుకోవడం వంటివి ఇంటికి దరిద్రాన్ని తీసుకొస్తాయని చెబుతున్నారు. అందుకే మహిళలు ముఖ్యంగా జుట్టు దువ్వుకునే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. పొరపాటున కూడా ఇంట్లో వెంట్రుకలు పడకుండా జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు.

జుట్టు విరబోసుకుని ఈ పనులు చేసినా ఫలితం శూన్యం

ఇక ఎప్పుడు పడితే అప్పుడు తల దువ్వకూడదని కూడా సలహా ఇస్తున్నారు. ఊడిపోయిన వెంట్రుకలను ఇంట్లో ఎక్కడా పెట్టకూడదని, వాటిని ఇంటికి దూరంగా పడేయాలని సూచిస్తున్నారు. ఇంట్లో ఎక్కడపడితే అక్కడ వెంట్రుకలు పడితే అవి తినే ఆహారంలో కూడా పడే ప్రమాదం ఉంటుందని, తద్వారా ఆహారం కలుషితం అవుతుందని చెబుతున్నారు. స్త్రీలు జుట్టు విరబోసుకుని పూజలు చేయకూడదని, అలా చేసిన పూజలు ఆమోదయోగ్యం కావని చెబుతున్నారు.

# భగవంతుడు భావప్రియుడు

ఒకసారి కంచి పరమాచార్యులు సికింద్రా బాదులో మకాం చేశారు. దగ్గర్లోని ఆలయానికి వెళ్లి వస్తుంటే.. ఓ వ్యక్తి దగ్గరికొచ్చి, తాను తపాలా బట్వాడా ఉద్యోగినని పరిచయం చేసుకున్నాడు. 'స్వామీ! ఈ గుడిలో పూజారికి సంస్కృతం రాదు. మంత్రాలు చదువుతాడు కానీ, వాటికి అర్థం తెలియదు. అతను పూజారిగా ఉండి కూడా దండగే' అంటూ ఫిర్యాదు చేశాడు. పరమాచార్య నవ్వి.. 'అది సరేగానీ.. ఉత్తరాల్లో 'పిన్ కోడ్' అంటారు కదా.. ఇంతకీ పిన్ అంటే ఏంటయ్యా?' అనడిగారు. 'అదొక సంఖ్య స్వామీ! ప్రాంతాన్ని తెలియజేస్తుంది. ఉత్తరాల విభజనకు, బట్వాడాకు ఉపయోగపడుతుంది' అన్నాడు. 'ఇంతకీ పిన్ నిర్వచనం ఏమిటి?' అని మళ్లీ అడిగితే, తెలియదన్నాడు. 'నువ్వు తపాల ఉద్యోగివయ్యుండీ అదేంటో తెలియదా? పిన్ అంటే పోస్టల్ ఇండెక్స్ నంబర్. అది తెలియక పోయినా నీకేం సమస్య రాలేదు. ఉత్తరాల బట్వాడా సక్రమంగానే చేస్తున్నావు. అలాగే అర్చకుడికి సంస్కృత మంత్రాలకు అంతగా అర్థం తెలియకున్నా సమస్య ఎదురవలేదు. వేళకు బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. పూజారికి మంత్రాల అర్థం తెలియకుంటేనేం... దైవానికి తెలుసు. పూజాది కార్యక్రమాలు సక్రమంగా పూర్తిచేస్తాడు కనుక దేవుడు వాటిని స్వీకరిస్తాడు. భగవంతుడు భావప్రియుడే కానీ, భాషాప్రియుడు కాదు. ఒకరి దోషాలను వెతికే కంటే భగవంతుడిపై దృష్టి నిలపడం మంచిది' అంటూ హితవు పలికారు. ఉద్యోగి తన తప్పు తెలుసుకుని క్షమించమన్నాడు.

# అర్ఘ్యం.. ఆంతర్యం..

మన ఆచారాల్లో అర్ఘ్యం ఇవ్వడానికి ఎంతో ప్రాధాన్యముంది. నిజానికి 'అర్ఘ్యం' అంటే పూజించటం అని అర్థం. ఆ పూజకు వేటిని ఉపయోగిస్తామో, వేటితోనైతే పూజిస్తామో అది 'అర్ఘ్యం'. మహర్షుల మాటల్లో 'అర్ఘ్యం' అంటే పూజకు తగినది, పూజకు ఉద్దేశించిన జలం తదితర ద్రవ్యాలు- అని భావం. మహర్షులు, మహాత్ములు వచ్చినప్పుడు మహారాజు వారికి ఎదురేగి, అర్ఘ్య పాద్యాదులు సమర్పించినట్లుగా- పౌరాణిక కథల్లో చదువుతుంటాం. ఆ విధంగా అర్ఘ్యం ఇవ్వటం అంటే- 'సర్వం సమర్పించుకుంటున్నాను' అనే భావంతో నమస్కరించి, జలాలను అర్పించటం. ప్రత్యక్ష దైవమైన సూర్యభగవానుడికి అర్ఘ్యమివ్వటంలో కూడా అర్థం ఇదే. తెలిసో తెలియకో ఒక్కోసారి మన మనసుల్లో చెడు ఆలోచనలు రావటం సహజం. పాపచింతనలు అనే ఆ రాక్షసులు మన సర్వేంద్రియాల్లోకి చొచ్చుకు వెళ్లి, జ్ఞానకిరణాలు సోకనివ్వకుండా అవరోధం కలిగిస్తుంటారు. అలాంటి అసురుల్ని నశించచేయాలి. అప్పుడిక జ్ఞానజ్యోతి నిరాటంకంగా మన ఇంద్రియాల్లో ప్రవేశిస్తుంది. ఇందుకుగానూ ప్రత్యక్షదైవమైన సూర్యభగవానుడికి సర్వసమర్పణా భావంతో 'అర్ఘ్యం' ఇవ్వాలని చెబుతారు. అలా అర్ఘ్యం ఇవ్వటం వల్ల మన మనసులోని మాలిన్యం, అహంకారం నశిస్తాయి. ఆత్మవిశ్వాసం, మనోధైర్యం కలుగుతాయి. బుద్ధి వికసిస్తుంది.

## అంతా ఆయనే చూసుకుంటాడు

ఓ భక్తుడు రమణ మహర్షితో 'నేను పది సంవత్సరాల నుంచి ఆశ్రమానికి వస్తున్నాను. మీరు సూచించిన సాధనలన్నీ చేస్తున్నాను. అయినా ఆధ్యాత్మికంగా ఎలాంటి అభివృద్ధీ నాలో కనిపించటం లేదు. ఎందుకు స్వామీ?' అంటూ సందేహం వెలిబుచ్చాడు. తన జీవితం పారమార్థిక పురోగమన దిశలో సాగుతుందో, లేదోనన్న సంశయాన్ని వ్యక్తం చేశాడు. అది విన్న రమణులు తమ సహజమైన మందహాసం చేశారు. రైలు ప్రయాణాన్ని ఉదాహరణగా చూపెడుతూ ఆధ్యాత్మిక బోధ చేశారు. 'ఒక వ్యక్తి కాశీకి మొదటి తరగతిలో ప్రయాణిస్తూ.. గార్డును 'దయచేసి కాశీలో నన్ను నిద్రలేపండి' అనడిగాడు. తర్వాత కిటికీలు మూసి, నిద్రపోయాడు. మధ్యరాత్రి నిద్ర లేచి 'అయ్యో! కాశీ దాటిపోయిందేమో? ఇప్పుడేం చేయాలి?' అంటూ భయపడ్డాడు. అలాంటి వ్యక్తిని వివేకి అంటారా? అనరు కదా! తన బాధ్యత గార్డుకు చెప్పటం వరకే. ఆ సంగతి గార్డు చూసుకుంటాడు కదా! ఇక్కడ మొదటి తరగతి ప్రయాణికులంటే భక్తులు. గార్డు అంటే భగవంతుడు. భవబంధాల నుంచి దాటించే బాధ్యతను ఆయన తీసుకోడా? సందేహం ఎందుకు?' అని మహర్షి స్పష్టం చేశారు. ఫలితంపై ఎక్కువ ఆలోచించకుండా, ఆధ్యాత్మిక సాధనలు చేయటంపైనే దృష్టి నిలపాలని చెప్పకనే చెప్పారు.

## అన్న మాట జవదాటని అర్జునుడు

ధర్మరాజు అశ్వమేధ యాగం చేయాలనుకున్నాడు. వ్యాసుడు, తదితరులు ఉత్తమ జాతి అశ్వాన్ని ఎంపిక చేయగా, దాని రక్షణ కోసం అర్జునుణ్ణి నియమించాడు. దేశ రక్షణ చేసేందుకు భీముణ్ణి, నకులుణ్ణిబీ కుటుంబాన్ని రక్షించేందుకు సహదేవుణ్ణి నియమించాడు ధర్మరాజు.

యాగాశ్వం వెంట రక్షకుడిగా వెళ్తున్న అర్జునుడితో 'యుద్ధంలో రాజులంతా నశించారు. నువ్వు తొందరపడి వారి పుత్రుల్ని సంహరించవద్దు. అనునయంగా వారిని ఒప్పించి యాగాశ్వాన్ని ముందుకు నడిపించు. క్రోధాన్ని వదిలిపెట్టు. మళ్లీ మళ్లీ యుద్ధం చేసి జన ధన ప్రాణ నష్టం కలిగించవద్దు' అని హితబోధ చేశాడు ధర్మరాజు.

అర్జునుడు అలాగే నడుచుకున్నాడు. ఎదిరించిన రాజులను మంచి మాటలతో వశపరచుకున్నాడు. పట్టు వీడని రాజులతో యుద్ధం తప్పలేదు. అప్పుడు కూడా వారి ప్రాణాలు తీయకుండా, ఆయుధాలు పడగొట్టడం, రథాలను కూల్చడం.. అలా భయపెట్టాడే తప్ప అన్నగారి మాట జవదాటలేదు.

పౌరుషంతో యాగాశ్వాన్ని అడ్డగించి అర్జునుడితో యుద్ధం చేసిన రాజులు కొందరున్నారు. వారిలో త్రిగర్త దేశ రాజ సోదరులు సూర్యవర్మ, కేతువర్మ, ధృతవర్మ, ప్రాగ్జ్యోతిషపుర రాజు వజ్రదత్తుడు, సింధు దేశ రాకుమారులు, మణిపుర పట్టణాధీశుడు బభ్రువాహనుడు, జరాసంధుడి మనవడు, శిశుపాలుడు, ఏకలవ్యుల పుత్రులు.. తదితరులున్నారు. వారెవరికీ ప్రాణహాని కలగకుండా జయించి.. ధర్మరాజు తరఫున యాగానికి ఆహ్వానం పలికాడు. అలా విజయయాత్ర ముగించి యాగాశ్వంతో హస్తిన చేరుకున్నాడు అర్జునుడు.

## దారితప్పవద్దు

ఒక వ్యక్తి నీళ్ల కోసం బావి తవ్వాలనుకున్నాడు. అక్కడే ఉన్న ఓ మిత్రుణ్ని అడిగితే "ఇక్కడ తవ్వు" అని ఓ చోటు చూపించాడు. పది అడుగులు తవ్వాక అక్కడ నీళ్లు పడకపోవడంతో అతడు నిరాశ చెందాడు. అంతలో అక్కడికి మరో మిత్రుడు వచ్చి ఇంకోచోటు చూపించాడు. అక్కడ ఇరవై అడుగులు తవ్వినా నీళ్లు పడలేదు. ఆ వ్యక్తిలో నిరాశ నిండింది. అంతలో అలా నడుచుకుంటూ వెళ్తున్న మరో మిత్రుడు మరొక చోట తవ్వమని ఉచిత సలహా ఇచ్చాడు. అక్కడ ముప్పై అడుగుల లోతు తవ్వాడు. అయినా నీటి జాడ కనిపించలేదు. దాంతో ఆ వ్యక్తి తీవ్ర నిస్పృహతో కూర్చున్నాడు. ఈ తతంగమంతా దూరం నుంచి గమనిస్తున్న ఓ పెద్దాయన అతడి వద్దకు వెళ్లి, "నాయనా! నువ్వు ఇప్పటిదాకా చాలా కష్టపడ్డావు. అదంతా వృథా శ్రమ. ఆ ప్రయాస ఏదో ఒక్క చోటే పడి ఉంటే ఫలితం దక్కేది. ఓపికతో, పట్టుదలతో ఒక్క చోటే ఎక్కువ లోతు తవ్వి ఉంటే నీళ్లు పడేవి. అక్కడ కొంచెం, ఇక్కడ కొంచెం తవ్వడం వల్ల ఎలాంటి ప్రయోజనం దక్కకుండా పోయింది" అని చెప్పాడు. రామకృష్ణ పరమహంస ఈ కథను భక్తులకు వివరిస్తూ "ఏదో ఒక ధర్మాన్ని విశ్వసిస్తే సత్యమేదో తెలుస్తుంది. ఆధ్యాత్మికోన్నతి సాధ్యపడుతుంది. సంశయాలతో మార్గాల్ని మారుస్తూ ఉంటే ఎప్పటికీ గమ్యానికి చేరుకోలేవు" అని బోధించారు.

## తీర్థయాత్రలెందుకు?

తీర్థయాత్రలు గొప్పవని మహాభారతం చెప్పింది. విశ్వాసంతో, ఇంద్రియ నిగ్రహంతో తీర్థయాత్రలు చేయాలని వాయుపురాణం ఉద్ఘాటిస్తోంది. తీర్థయాత్రలు మనశ్శుద్ధి కోసం ఏర్పడ్డాయని స్కాంద పురాణం పేర్కొంటోంది. దీనివల్ల పాపాలు పోతాయని, పుణ్యాత్ములకు మరింత పుణ్యం కలుగుతుందన్నది పెద్దల మాట. ఒక్కో నేలకు, ఆయా ప్రాంతాల్లోని నీటికి కొన్ని విశిష్ట గుణాలుంటాయి. తీర్థయాత్రల్లో భాగంగా ఆయా పుణ్యజలాల్లో మునగడం వల్ల కొన్ని రోగాలు తగ్గిపోతాయని విజ్ఞులు చెబుతారు. ఏది ఏమైనా భగవంతుడిపై భక్తిభావం మరింత పెరగడానికి, మానసిక ఉల్లాసానికి తీర్థయాత్రలు తోడ్పడతాయి. మోసం చేసే ప్రవృత్తి కలిగినవాళ్లు, దుర్మార్గులు, ఇంద్రియాలను అదుపులో పెట్టుకోలేని వారు ఏ తీర్థంలో మునిగినా ఎలాంటి ప్రయోజనం ఉండదని స్కాంద, పద్మపురాణాలు హెచ్చరిస్తున్నాయి. అలాగే గృహస్థు తన విధులను వదిలిపెట్టి తీర్థయాత్రలు చేస్తే పుణ్యం రాదని కూర్మపురాణం హితబోధ చేసింది. అన్ని మతాల్లో తీర్థయాత్రలు ఉన్నాయి. కొందరికి తీర్థయాత్రలు చేయడానికి ఆర్థిక స్థోమత ఉండకపోవచ్చు. అయితే మనసు, మాట, చేతలు స్వచ్ఛంగా ఉండేవారికి, అహంకారం లేనివారికి, ఇతరులను తనలాగే చూసేవారికి, ఉన్నదాంట్లోనే సంతృప్తిపడే వారికి తీర్థయాత్రల వల్ల వచ్చే ఫలం సిద్ధిస్తుందని మహాభారతంలోని అరణ్యపర్వం ఉద్ఘాటిస్తోంది.

# అమ్మవారి కోరిక.. 257 ఏళ్లుగా నిమజ్జనం చేయని దుర్గమ్మ విగ్రహం

వారణాసిలోని దుర్గాబరి ఆలయంలో 250 ఏళ్ల క్రితం నెలకొల్పిన అమ్మవారి విగ్రహాన్ని ఇప్పటికీ నిమజ్జనం చేయట్లేదు. ఈ విగ్రహాన్ని నిమజ్జనం చేయవద్దని సాక్షాత్తూ ఆ అమ్మవారే కోరినట్లు ఇక్కడి ప్రజల విశ్వాసం.
వారణాసిలోని దుర్గాబరి ఆలయంలో 250 ఏళ్ల క్రితం నెలకొల్పిన అమ్మవారి విగ్రహాన్ని ఇప్పటికీ నిమజ్జనం చేయట్లేదు. ఈ విగ్రహాన్ని నిమజ్జనం చేయవద్దని సాక్షాత్తూ ఆ అమ్మవారే కోరినట్లు ఇక్కడి ప్రజల విశ్వాసం.
"దసరా నవరాత్రుల సందర్భంగా 1767లో మట్టితో చేసిన అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నవరాత్రులు పూర్తయ్యాక నిమజ్జనం కోసం విగ్రహాన్ని ఎత్తడానికి ప్రయత్నించగా ఎంతకీ సాధ్యం కాలేదు. 2 రోజుల తర్వాత మళ్లీ ప్రయత్నించినా విఫలమైంది. తర్వాత ఓ రోజు అమ్మవారు కలలో కనిపించి తనకు అక్కడే ఉండాలని ఉందని, నిమజ్జనం చేయవద్దని చెప్పిందని ప్రజలు చెబుతున్నారు. దీంతో ఆ దుర్గమ్మ విగ్రహం 257 ఏళ్లుగా ఇక్కడే ఉంది" అని ఆలయ సిబ్బంది తెలిపారు.

## విద్యాలక్ష్మికి పంచామృత అభిషేకాలు



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):** దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని ప్రముఖ భారతీయ తత్వ దర్శన కేంద్రం శ్రీ క్షేత్రంలో కొలువై ఉన్న అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి దేవాలయంలో విద్యాలక్ష్మి అమ్మవారికి పంచామృత అభిషేకాలు గావించారు. బుధవారం ఉదయం అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు ,చామర్తి శ్రీనివాస్ రమేష్ ఆచార్యులు వేదమంత్రాల నడుమ విద్యాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు పంచామృత అభిషేకాలు గావించారు .ఈ ఉత్సవంలో దేవాలయం ధర్మకర్తలు దుర్గా బాలాజీ ,ఉమాదేవి దంపతులు ,భక్తులు పాల్గొన్నారు.

## 92 వార్డు గోపాలపట్నం రైతు బజార్‌లోని సబ్సిడీపై టమాట విక్రయాలు స్టాల్స్




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** బుధవారం 92 వార్డు గోపాలపట్నం రైతు బజార్‌లోని సబ్సిడీపై టమాట విక్రయాలు స్టాల్ ప్రారంభించిన పశ్చిమ శాసనసభ్యులు గణ బాబు ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా టమాటా రైతు గిట్టుబాటు ధర లభించక, తప్పని పరిస్థితుల్లో అధిక అధిక రేటుకు టమాటా విక్రయించ వలసినప్పటికీ ప్రభుత్వమే ఆ అధిక ఖర్చులు భరిస్తూ సబ్సిడీపై ఈ రైతుబజార్లో సామాన్య ప్రజానీకానికి టమాటాలు విక్రయించడం హర్షణీయమైన విషయమని గణబాబు వెల్లడించారు ఈ కార్యక్రమంలో 92 వ వార్డు 91వ వార్డు పార్టీ కార్యకర్తలు, మార్కెటింగ్ అధికారులు కొనుగోలు దారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చింతన అవసరం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రతి ఒక్కరికీ అధ్మాత్మిక చింతన అవసరమని విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. మధురవాడ ,టైలర్స్ కోలనీలో వేంచేసి యున్న శ్రీ విజయ దుర్గాదేవి అమ్మ వారిని ఆయన దర్శించుకున్నారు. దేవి శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని ఆలయ ధర్మకర్తలు బంగారు సుబ్బారావు ,లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో కనుల పండుగగా అఖండ దీపారాధన నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న సీపీ బాగ్చి ఈ సందర్భంగా మాట్లాడుతూ మనం చేసే ఎలాంటి కార్యకలాపాలకైనా ఆలోచ నలే ఆధారమన్నారు ..అవి మంచివైతే సత్సంకల్పాలకు శ్రీకారం చుడతా యన్నారు.. చెడువైతే దుర్మార్గాలను ప్రేరేపిస్తాయనీ, ఆలోచనలకు ఆధ్యా త్మికత తోడైతే.. అవి ఆత్మాన్వేషణ దిశగా మరలుతాయన్నారు.. అందుకే ప్రతీ ఒక్కరిలో భక్తి భావం పెంపొందా లన్నారు. అమ్మవారి ఆశీస్సులు విశాఖ నగర ప్రజలు అందరిపై ఉండాల న్నారు. ఎంతో చక్కగా ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్త మండలి సభ్యులను అభినం దించారు. అఖండ దీపారాధన కార్యక్రమానికి ముందుగా ఆయన దీపప్రజ్వలన గావించారు. అనంతరం భక్తులందరు ఆలయ ప్రాంగణంలో దేవత మూర్తి ప్రతిమలపై ఉంచిన దీపాలను వెలిగించారు .. అన్ని దీపాలు ఒక్కసారిగా వెలగడంతో ఆలయ ప్రాంగణం మొత్తం దేదీప్యమానంగా ప్రకాశించింది .. అమ్మా పాహి ..జగదంబా పాహి అంటూ నామస్మరణలతో శ్రీ విజయ దుర్గాదేవి ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది .. ఈ కార్యక్రమంలో ఆలయ దర్మకర్తమండలి సభ్యులు బంగారు ప్రకాష్ ,బంగారు అశోక్ ,బంగారు ఝాన్సీ ,తెంటు మాధవి , తెంటు భరణ్ కుమార్ ,కౌశిక్ ,కార్తీక్ ,నవగాని శరత్ ,లక్ష్మణ్,సునీల్అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నెహ్రూ చౌక్ వద్ద బిజెపి విజయోత్సవ వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పిలుపుమేరకు హర్యానా ఎన్నికల్లో విజయం సాధించినందుకు గాను ఈరోజు ఉదయం 11 గంటలకు అనకాపల్లి అసెంబ్లీ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు అద్వర్యంలో నాలుగు రోడ్ల జంక్షన్లో స్వీట్లు పంచి బాణాసంచా కాల్చి విజయోత్సవ వేడుకలు జరుపుకోవడం జరిగినది, ఈ సందర్భంగా అనకాపల్లి అసెంబ్లీ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వర్ రావు గారు మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ మీద ఉన్న నమ్మకంతో హర్యానా రాష్ట్ర ప్రజలు ఈరోజు బిజెపికి పట్టం కట్టడం జరిగినది, అక్కడ ప్రజలు పార్టీ మీద అలాగే, దేశ ప్రధాని నరేంద్ర మోడీ మీద ఉన్న విశ్వాసాన్ని నమ్మకాన్ని ఈరోజు రుజువు చేసుకోవడం జరిగిందని తెలిపారు, నిరంతరము దేశ అభివృద్ధిని రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడుతున్న నరేంద్ర మోడీ కి హర్యానా రాష్ట్ర ప్రజలకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు వి రమేష్ సీనియర్ నాయకులు కొణతాల అప్పలరాజు జిల్లా కార్యదర్శి ఓ నాగమణి జిల్లా యువమోర్చ అధ్యక్షులు జి స్వరూప్ కిసాన్ మోచ జోనల్ ఇంచార్జ్ భక్త సాయిరాం మండల అధ్యక్షుడు నర్సింగ్ యాదవ్ బొడ్డేడ బాస్కరరావు బి శేషగిరిరావు రాజు గారు తదితర బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భద్రకాళి అవతారంలో దర్శనమిచ్చిన శ్రీ కన్యకా పరమేశ్వరి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో అమ్మవారి ప్రతిష్ఠా శతజయంతి ఉత్సవాలు శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి శరన్నవరాత్రి మహోత్సవం భాగంగా బుధవారం అమ్మవారు శ్రీ భద్రకాళి దేవిగా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు, ఆలయ మండపంలో సామూహిక కన్య కలపూజలు నిర్వహించారు. ఉదయం బేడసేవ శ్రీ చక్ర అభిషేకాలు నక్షత్ర హారతి గోపూజ నిర్వహించారు,ఈ కార్యక్రమంలో. ప్రతిష్ట శత జయంతి ఉత్సవములచైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషు కుమార్, ఆలయ అధ్యక్షులు బిళ్ళపాటి కృష్ణ కుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు. ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతి దేవీ అవతారంలో శ్రీ విజయ దుర్గాదేవి





**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ నగరంలోని మధురవాడ ,టైలర్స్ కోలనీలో వేంచేసి యున్న శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో దేవి శరన్నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారు 'సరస్వతి దేవి 'అవతారంలో భక్తులకు దర్శన మిచ్చారు . ఆలయ దర్మకర్తలు బంగారు సుబ్బారావు,లక్ష్మి దంపతుల అధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు శ్రీకాంత్ శర్మ వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి విశేష మూలా నక్షత్ర యుక్త అష్టోత్తరనామార్చన పూజలు నిర్వహించారు. అనంతరం నైవేద్యం సమర్పించారు. మూలా నక్షత్రం సందర్భంగా ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిం చారు. దీనికోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు.అమ్మవారి దర్శనానికి స్థానిక ప్రాంతాలతో పాటుగా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు బంగారు ప్రకాష్ ,బంగారు అశోక్ కుమార్ బంగారు ఝాన్సీ ,తెంటు మాధవి తదితరులు పాల్గొన్నారు.

# అందరికీ సూపర్ హీరో నాన్నే...



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సుధీర్ బాబు హెూల్సమ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మా నాన్న సూపర్ హీరో' తో అలరించబోతున్నారు. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సీ ఏ ఎం ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి వీ సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సునీల్ బలుసు నిర్మించారు. ఆర్ణ హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రంలో సాయి చంద్, సాయాజీ షిండే కీలక పాత్రలు పోషించారు. చిత్ర బృందం బుధవారం విశాఖలో సందడి చేసింది. సినిమా ప్రమోషన్ లో భాగంగా ఎం వి పీ కాలనీ గాది రాజు ప్యాలస్ లో నిర్వహించిన మీడియా సమావే శంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే విడుదలైన ఈ మూవీ ప్రమోషనల్ కంటెంట్ స్ట్రాంగ్ బజ్ క్రియేట్ చేసింది అన్నారు. మా నాన్న సూపర్ హీరో అక్టోబర్ 11న గ్రాండ్ గా విడుదల కానుంది అని తెలిపారు.

ఫాదర్- సన్ ఎమోషన్ యూనివ ర్సల్, ఈ సినిమాలో ఆ ఎమోషన్ చూపిం చడానికి మా నాన్న సూపర్ హీరో కాన్ఫ్లిక్ట్ పాయింట్ బాగా సెట్ అయింది. ఇద్దరు తండ్రులు, ఒక కొడుకు చుట్టూ తిరిగే కథ ఇది. తండ్రిని చూసుకోవడానికి కొడుకు పడే తపన లో చాలా కొత్త సిచువేషన్స్ ఇంట్రెస్టింగ్ గా క్రియేట్ అయ్యాయి. ఫాదర్ సన్ ఎమోషన్ ఆల్రెడీ ఉంది. అది జనాలకి గుర్తు చేస్తే చాలు. నాన్నని ప్రేమిస్తున్న కథ చెబుతున్నప్పుడు ఎక్స్ప్లెయిన్ చేయాల్సిన అవసరం లేదు. క్యారెక్టర్స్, కాన్ఫ్లిక్ట్ ఫస్ట్ లోనే ఎస్టాబ్లిష్ అవుతాయి. దీన్ని ఇద్దరు ఫాదర్స్, ఒక కొడుకు మధ్య నడిచే ట్రయాంగిల్ లవ్ స్టోరీ అని చెప్పొచ్చు. ఇది యూనివర్సల్ పాయింట్. తప్పకుండా అందరికీ కనెక్ట్ అవుతుందని నమ్ముతున్నాను అన్నారు.

ఇది థ్రిల్లర్ కాదు. తొలి రెండు సీన్స్ లోనే కథ ఏమిటనేది ఆడియన్స్ కి క్లియర్ గా తెలుస్తుంది. అయితే ఆ సిచువేషన్స్ ఎప్పుడు వస్తాయి, అవి వచ్చినప్పుడు ఎలా ఫేస్ చేస్తారు అనేది ఇంపార్టెంట్. హ్యూమన్ రిలేషన్స్ మీద ఉన్న పాయింట్ ఇది. ఇది ఎలాంటి సినిమా, ఆడియన్స్ సినిమా నుంచి ఏమి ఆశించవచ్చు అనేది క్లారిటీగా చెప్పడానికి ట్రై చేశాం.

**ఇందులో రియల్ లైఫ్ ని గుర్తు తెచ్చిన మూమెంట్స్ ఏమిటి ?**

ఇందులో దాదాపు అన్ని సీన్స్ నన్ను ఇమోట్ చేశాయి. ఇందులో హీరో తండ్రిని విపరీతంగా ప్రేమిస్తాడు. ఈ ఎమోషన్ నేచురల్ గా నా నుంచి వచ్చింది. మన అందరికీ సూపర్ హీరో నాన్నే. ఇందులో ఓవర్ ది బోర్డ్ పెర్ఫార్మెన్స్ లు చేయకూడదని అనుకున్నాం. కెమరా మూమెంట్స్ కూడా చాలా సహజంగా వుంటాయి. నేచురల్ గా చేయడానికి ప్రయత్నించాం. మీరు గమనిస్తే.. గత పెర్ఫార్మెన్స్ లకి, ఈ సినిమాకి ఎక్కడా రిఫరెన్స్ పాయింట్ వుండదు. ఎలాంటి సినిమాటిక్ లిబర్టీ తీసుకోకుండా చేసిన సినిమా అన్నారు. విశాఖ, విజయ వాడ, హైదరా బాదు నగారాలలో ప్రీమియర్ షోలు వేస్తున్నాం. ఫ్యాన్స్ నవ దళపతి అని పిలవడం సంతోషంగా ఉందన్నారు. తాను రిటైర్ అయ్యాక విశాఖ లోనే స్థిర పడతాను. విశాఖ బీచ్ అంటె ఎంతో ఇష్టం అని గుర్తు చేశారు. అనంతరం ఆయన అభిమానులతో ఫ్యాన్స్ మీట్ లో పాల్గొన్నారు.

## దారి దోపిడీకి పాల్పడిన నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్న పోలీసులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఈనెల ఐదున ఏ.పీ జెన్కో లో పని చేస్తున్న చెక్క సుధా అనే మహిళ కూర్మన్నపాలెం వెళ్లేందుకు అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ బయట వేచి ఉన్న సమయంలో ఆటోలో ఇద్దరు మహి ళలతో వచ్చిన ఆటోడ్రైవర్ గాజువాక వెళ్తున్నట్టు చెప్పడంతో సుధా ఆటో ఎక్కారు, అనంతరం జలగల మదుం, జాతీయ రహదారి వద్ద ఆటోలో ఉన్న ఇద్దరు మహిళలు కత్తితో బెదిరించి ఆమె బ్యాగ్ లో ఉన్న రూ.1,80,000/- విలువగల బంగారాన్ని తీసుకొని ఆమె ను ఆటో నుంచి తోసి వేసి పరా రయ్యారు. రెండో కేసులో తిరునగరి గోవిందమ్మ, (60 ), తిమ్మరాజు పేట గ్రామం, మునగపాక మండలానికి చెందిన మహిళ అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్ నుండి తిమ్మరాజుపేటకు వెళుతుండగా పై నిందితులు అచ్యుతాపురం వెళ్తున్నామని ఆటో ఎక్కించుకొని పూడిమడక రోడ్డు వద్ద నిందితులు కత్తులు చూపించి ఆమె వద్ద ఉన్న సుమారు 9 తులాల బంగారాన్ని లాక్కుని పరారయ్యారు.పై ఇరువురి ఫిర్యాదు మేరకు అనకాపల్లి టౌన్ ఎస్.హెచ్.ఓ టీ.వీ.విజయ్ కుమార్ ఫిర్యాదును స్వీకరించి, జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేసి మంగళవారం నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తును అనకాపల్లి టౌన్ పోలీసులు స్వాధీన పరుచుకున్నారు. ఈ కేసుల్లో ఇంకా ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయవలసి ఉంది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎం.దీపిక అనకాపల్లి టౌన్ పోలీసులను ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డులను ప్రకటించారు.

## గాజువాక పోలీసు స్టేషన్ నందు ఇన్స్పెక్షన్ నిర్వహిస్తున్న నగర పోలీసు కమిషనర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నగరంలో లా & ఆర్డర్ అదుపులో ఉంచుతూ నగరం మొత్తం ప్రశాంతముగా ఉండేలా అన్ని లా & ఆర్డర్ పోలీస్ స్టేషన్ల నందు ఇన్స్పెక్షన్ చేపడుతున్న నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి, ఐ.పి.ఎస్.,

ఇందులో భాగంగా సిపి గాజువాక పోలీసు స్టేషన్‌ను సందర్శించి, అధికారులను, సిబ్బందిని, స్టేషన్ పరిధిలో గల సమస్యలు, కేసుల రికార్డులు అన్నీ సక్రమముగా ఉన్నదీ లేనిదీ పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలను జారీ చేయడం జరుగుతుంది.

## మహిళా సాధికారిక భవనానికి మంచినీటి బోరు ఏర్పాటు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, కూటమి నాయకులు, కమిషనర్, మేయరు ఆశీస్సులతో 80వ వార్డులో పల్లూరు గ్రామంలో బుధవారం నిర్మాణంలో ఉన్న మహిళా సాధికారిక భవనం నకు బోరు వేయించడం జరిగింది. ఈ కార్యక్రమం ఈ వార్డు కార్పొరేటర్ నీలిమ భాస్కర్, మరియు కూటమి నాయకుల చేతుల మీదుగా చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు యర్ర వెంకట సత్యనారాయణ ఎక్స్ సర్పంచ్,సిమ్మ ముసలి నాయుడు, దుంగ ఈశ్వరరావు, కట్ట శ్రీను, దుంగ నాగేశ్వరరావు, సీకు వీరు నాయుడు,సిమ్మా నాగరాజు, యర్ర ఉమాలక్ష్మి, కే. హరీష్, మరియు జీవీఎంసీ వాటర్ సప్లై సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## సరస్వతి దేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): ప్రసిద్ధి చెందిన అనకాపల్లి గవరపాలెం శతకం పట్టు శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయ ఆధ్వర్యంలో జరుగుతున్న దుర్గాదేవి నవరాత్రి మహోత్సవంలో భాగంగ బుధవారం శ్రీ సరస్వతి దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయగిరి చంద్రశేఖర్, అమ్మవారిని సరస్వతి దేవిగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు భోగా పురుపు వెంకటరమణ (బాబు) ఆధ్వర్యంలో అమ్మవారికి నిత్య పూజ్యులు అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ & పీలా గోవింద సత్యనారాయణ ఆర్థిక సహకారంతో మాల ధారణ చేసిన భవానీ భక్తులకు నవరాత్రి పది రోజులు అన్న సమారాధన ఆలయ కమిటీ నిర్వహిస్తోంది. సరస్వతి పూజ సందర్భంగా సామూహిక చిన్నారులచే సరస్వతి పూజ చేయించి పుస్తకాలను ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు భాగ్యలక్ష్మి దంపతులు పంపిణీ చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహం రథోత్సవం పట్టణ పరిధిలో గుండా ఊరేగింపు జరుగుతుంది.ఈ కార్యక్రమంలో. ఆలయ శాశ్వత చైర్మన్, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ భీమర శెట్టి వరాహ నూకరాజు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు,శ్రీ గౌరీ పరమేశ్వరి కమిటీ, శ్రీ గౌరీ పరమేశ్వరి ప్రజా టెంట్ హౌస్, శ్రీ మరిడమాంబ ఉత్సవ కమిటీ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణి గిరి పై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ దర్శించుకున్న రత్నాకర్ దంపతులు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): మండలంలో నున్న సత్యనారాయణపురం కళ్యాణగిరి పై వెలసిన శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో బుధవారం అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం మరియు సరస్వతీ పూజ కార్యక్రమం సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు దాడి విద్యాసంస్థల అధినేత దాడి రత్నాకర్, అచ్చుతా దంపతులు విచ్చేసి సరస్వతీ రూపంలో దర్శమిస్తున్న శ్రీశ్రీశ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపా కటాక్షాలకు పాత్రులైనారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మరియు చైర్మన్ దాడి రత్నాకర్ దంపతులకు శాలువా కప్పి చిరు సత్కారం చేసి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఆలయము భక్తులకు అనుకూలంగా అభివృద్ధి చేసే కార్యక్రమాల గురించి చర్చించడం జరిగింది. దేవాలయము అధ్యక్షులు ఎడ్ల త్రినాథ్ ధర్మకర్త బోయిన రమణాజీ చైర్మన్ మేడిశెట్టి రామ్ సత్యనారాయణ గౌరవ అధ్యక్షులు పలక సత్యనారాయణ ప్రధాన అర్చకులు రేజేటి రామాచార్యులు సిలపరశెట్టి బాబి కొత్తూరు వార్డు మెంబర్ దొడ్డి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

## పరవాడలో ఘనంగా భారీ అన్న సమారాధన



పరవాడ, (విశాఖ సమాచారమ్): మండల కేంద్రమైన పరవాడలో శ్రీశ్రీశ్రీ దుర్గాదేవి శరన్నవత్తు సందర్భంగా యంగ్ మెన్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు ఆధ్వర్యంలో బుధవారం జరుపబడిన అన్న సమారాధనలో సుమారు 3000 మంది భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ అన్న సమారాధనకు ముఖ్యఅతిథిగా ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాస్ పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో. ఉప సర్పంచ్ బండారు రామారావు, బిజెపి నాయకులు గండి నమో బాబు, వైకాపా నాయకులు పైల హరీష్, వ్రేశ హరి, పైల అప్పలనాయుడు, రెడ్డి సింహాచలం, గండి లోకేష్, తేలు రమణాజీ, గండి ఈశ్వరరావు, రొంగలి అప్పలనాయుడు, బొడ్డు అచ్చం నాయుడు, రెడ్డి నారాయణరావు, బండారు ఆనంద్, బొడ్డు బుజ్జి, చుక్క నమో, చుక్క గోపి, చుక్క అప్పలనాయుడు, ఆడారి రామచంద్రరావు, సూర్య, గండి శ్రీనివాసరావు, ద్వారపూడి శ్రీనివాసరావు, గండి అప్పారావు, బంగారం, చలపతిరావు, కుంద్రపు చినబాబు, చుక్క వెంకటలక్ష్మి రాంబాబు, పిల్లా జగదీష్, బిజెపి నాయకులు కుంద్రపు సోము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబరు 11 వరకు మద్యం షాపుల దరఖాస్తుల గడువు

విభిన్న వర్గాల నుండి అందిన వినతుల మేరకు మద్యం షాపుల కోసం నిర్దేశించిన దరఖాస్తుల సమర్పణ గడువును అక్టోబరు 11 వరకు పొడిగించినట్లు అబ్కారీ శాఖ సంచాలకులు నిషాంత్ కుమార్ తెలిపారు. అన్ లైన్ తో సహా అన్ని విధానాలలో దరఖాస్తులకు అదే రోజు సాయంత్రం 7 గంటల వరకు అవకాశం ఉంటుందన్నారు. అక్టోబరు 12,13 తేదీలలో దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి, 14వ తేదీన అయా జిల్లాలలో కలెక్టర్ల పర్యవేక్షణలో మద్యం షాపుల కోసం లాటరీ తీస్తారని వివరించారు. అదే రోజు కేటాయింపు ప్రకియను పూర్తి చేస్తామని, అక్టోబరు 16 వ తేదీ నుండి నూతన మద్యం విధానాన్ని అనుసరించి ప్రవేటు మద్యం షాపులు అందుబాటు లోకి వస్తాయని నిషాంత్ కుమార్ పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ విజయోత్సవ సంబరాలు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): జమ్మూ కాశ్మీరు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో ప్రజల మెప్పుపొంది అనూహ్యంగా గెలిచిన కాంగ్రెస్ పార్టీ గెలిచినందుకు విశాఖపట్నం కాంగ్రెస్ పార్టీ పార్టీ కార్యాలయం నందు పార్టీ సీనియర్ నాయకులు మరియు అభిమానులు బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్న విశాఖ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు లక్కరాజు రామారావు విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు కె వి సూర్య నారాయణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివకుమార్ పీనమలా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కస్తూరి వెంకట్రావు ఏఐసీసీ సేవాదళ్ నాయకులు గంగాధర్ సేవాదళ్ అప్పారావు, సిటీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సతీష్ గారు ,మైనారిటీ సెల్ అధ్యక్షులు అర్షాద్ భాష 28వార్డు అధ్యక్షులు గుర్రం కనకారావు మరియు ఇతర కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# తాతయ్య బాబును సత్కరించిన బుద్ధ



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు కు కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన సందర్భంగా వడ్డాది గ్రామంలో వారి స్వగృహంలో బుధవారం మాజీ శాసనమండలి సభ్యులు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు పాల్గొని తాతయ్య బాబుకు శాలువాతో సత్కరించి శ్రీ నూకాంబికా అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న పార్టీ నాయకులకు తాతయ్య బాబు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి క్రియాశీలకంగా ఉంటూ పార్టీలో చురుకైన పాత్ర వహించి చోడవరం నియోజకవర్గంలో ప్రతి ఎన్నికలలో గ్రామస్థాయి నుండి నియోజకవర్గం వరకు అన్ని ఎన్నికల్లో పార్టీని విజయకేతం ఎగరవేశారని, చోడవరం ఇన్చార్జిగా 2019 నుంచి 24 వరకు వైసిపి ప్రభుత్వం అరాచకాలపై రాష్ట్ర పార్టీ ఆదేశాలకు అనుగుణంగా అనేక ఉద్యమాలను పోరాటాలు చేశారని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలు ముందుకు తీసుకువెళ్లారని అలాగే జిల్లా పార్టీ అధ్యక్షులుగా అన్ని నియోజకవర్గాలు ఇన్చార్జిలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లి పార్టీ విజయానికి విశేషమైన కృషి చేశారని ఈ సందర్భంగా తాతయ్య బాబుకు ప్రత్యేకమైన అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అనుబంధ సంస్థ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ పట్టణ ప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణ కాండ్రేగుల గోపికృష్ణ విద్యా సంస్థల అధినేత రమణాజీ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం రోడ్డు- విజయవాడ మధ్య ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): దసరా పండుగ సీజన్‌లో ప్రయాణీకుల అదనపు రద్దీని క్లియర్ చేయడానికి, రైల్వే విజయవాడ - శ్రీకాకుళం రోడ్ - విజయవాడ మధ్య దిగువ వివరించిన విధంగా ప్రత్యేక రైళ్లను నడుపుతుంది.

రైలు నెం. 07215 విజయవాడ - శ్రీకాకుళం రోడ్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు 9, 10, 11, 12, 14, 15, 16 మరియు 17 అక్టోబర్-24 తేదీలలో విజయవాడ నుండి 20:00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 01 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. :28గం మరియు 01:30గంటలకు బయలుదేరుబీ పెందుర్తి 02:23 మరియు బయలుదేరు 02:25గంబీ కొత్తవలస 02:33గం మరియు బయలుదేరు 02:35గంబీ విజయనగరం 03:05గం మరియు బయలుదేరు 03:15గం చీపురుపల్లి 03:38గం మరియు బయలుదేరు 03:40గంబీ పొందూరు చేరుకుని 03.58 గంటలకు, బయలుదేరి 04.00 గంటలకు శ్రీకాకుళం రోడ్డులో 05:30 గంటలకు చేరుకుంటుంది. (08 పర్యటనలు)

తిరుగు దిశలో రైలు నెం. 07216 శ్రీకాకుళం రోడ్ - విజయవాడ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు శ్రీకాకుళం రోడ్‌లో 10, 11, 12, 13, 15, 16, 17 మరియు 18 అక్టోబర్-24 తేదీలలో 06:30 గంటలకు బయలుదేరి 06.43 గంటలకు పొందూరు చేరుకుంటుంది. & 06.45hrs వద్ద బయలుదేరుబీ చీపురుపల్లి చేరుకోవడం 07:10గం మరియు బయలుదేరడం 07:12గంబీ విజయనగరం 07:50 గంటలకు మరియు 08:00 గంటలకు బయలుదేరుతుంది.

కొత్తవలస 08:30 గంటలకు మరియు బయలుదేరు 08:32 గంటలకుబీ పెందుర్తి 08:40 మరియు బయలుదేరు 08:42గంబీ దువ్వాడ 09:30 గంటలకు మరియు 09:32 గంటలకు బయలుదేరి 16:00 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. (08ట్రిప్పులు)

స్టాప్‌లు: ఈ జంట ప్రత్యేక రైళ్లకు ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, ద్వారపూడి, అనపర్తి, సామర్లకోట, అన్నవరం, తుని, ఎలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుకుళం, చీపురుకుళం, రోడ్ల మధ్య స్టాప్‌లు ఉంటాయి. స్టేషన్లు.

కంపోజిషన్: ఈ రైళ్లలో 3వ ఏసీ కోచ్‌లు-01, స్లీపర్ క్లాస్ కోచ్‌లు -05, జనరల్ సెకండ్ క్లాస్ -14, సెకండ్ క్లాస్ కమ్ దియాంగ్‌జన్ కోచ్ -01 మరియు మోటార్ కార్-01 ఉన్నాయి.

ఈ ప్రత్యేక రైలు సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

# హైదరాబాద్ మెట్రో 2కు రూ.25వేల కోట్లు కావాలి

గడిచిన కొంతకాలంగా హైదరాబాద్ మెట్రో 2 మీద జరుగుతున్న చర్చ అంతా ఇంతా కాదు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత హైదరాబాద్ లో మౌలిక సదుపాయాల మీద ఎక్కువగా ఫోకస్ చేయటం తెలిసిందే. ఇందులో భాగంగా తన కలల నగరమైన ఫోర్త్ సిటీతో పాటు.. హైదరాబాద్ లోని వివిధ ప్రాంతాలకు మెట్రో రైలు పరుగులు తీసేలా తన విజన్ ను ఆవిష్కరించారు. ఈ క్రమంలో 76.2కిలోమీటర్ల దూరానికి డీపీఆర్ లను సిద్ధం చేసేందుకు వీలుగా కసరత్తుకు ఆదేశాలు జారీ చేశారు.

తాజాగా ఫోర్త్ సిటీకి మినహాయించి.. మగిలిన ఐదురూట్లకు సంబంధించిన కారిడార్లకు వేర్వేరుగా నివేదికల్ని సిద్ధం చేశారు. తాజాగా ప్రభుత్వానికి సమర్పించారు. దీంతో డీపీఆర్ ప్రక్రియ పూర్తైంది. మొత్తం 76,.2 కిలోమీటర్ల మెట్రో నిర్మాణానికి రూ.24,269 కోట్ల వ్యయం అవుతుందన్న విషయాన్ని ప్రభుత్వానికి నివేదించారు. దసరా నాటికి తమకు డీపీఆర్ లు ఇవ్వాలన్న ప్రభుత్వం చెప్పిన మాటకు తగ్గట్లే హైదరాబాద్ మెట్రో అధికారులు పూర్తిస్థాయి నివేదికల్ని వేర్వేరుగా సిద్ధం చేసి ఇచ్చేశారు.

తాజాగా ఢిల్లీకి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రితో భేటీ అయ్యారు. ఈ సమావేశానికి డీపీఆర్ లను సిద్ధం చేయాలన్న ఆదేశాలతో వాటిని పూర్తి చేశారు. నిజానికి గతంలోనే నివేదికలు సిద్ధమైనప్పటికీ. కీలకమైన ట్రాఫిక్ అధ్యయన నివేదిక కోసం డీపీఆర్ లను ఆపారు. వాటిని కూడా కలిపి తాజాగా కేంద్రానికి నివేదించారు. తాజాగా కేంద్ర మంత్రిని కలిసిన ముఖ్యమంత్రి రేవంత్.. హైదరాబాద్ మెట్రో 2కు అవసరమైన అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ ప్రాజెక్టు



మీద కేంద్రం కూడా సానుకూలంగా ఉందన్న మాట వినిపిస్తోంది.

మెట్రో2ను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్మిస్తున్నారు. మొత్తం ప్రాజెక్టులో కేంద్రం 15 శాతం వాటాను భరించాల్సి ఉన్నా.. రెండో దశలో 18 శాతం భరించాలని కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 30శాతం.. నాలుగు శాతం పీపీపీ పెట్టుబడులకు అవకాశం కల్పించి.. మిగిలిన 48 శాతానికి సంబంధించి జైకా లాంటి సంస్థల నుంచి తక్కువ వడ్డీకి రుణాన్ని తీసుకోవాలన్న యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు చెబుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్య ప్రాజెక్టుపై రుణాలకు కేంద్రం పూచీకత్తుగా ఉంటుంది. త్వరలోనే ప్రధానమంత్రి మోడీని కలిసి.. మెట్రో2కు అవసరమైన అనుమతుల్ని వేగంగా ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ కోరనున్నట్లుగా చెబుతున్నారు. తాజాగా సిద్ధం చేసిన హైదరాబాద్ 2 మెట్రో రూట్లు ఇవే..

నాగోల్ - శంషాబాద్ ఎయిర్ పోర్టు 36.6కి.మీ.
రాయదుర్గం - కోకాపేట నియోపొలిస్ 11.6కి.మీ.
ఎంజీబీఎస్ - చాంద్రాయణగుట్ట 7.5కి.మీ.
మియాపూర్ - పటాన్ చెర్వు 13.4కి.మీ.
ఎల్బీనగర్ -హయత్ నగర్ 7.1కి.మీ.

## జీవీఎంసీ క్రికెట్ జట్టు అద్భుత ఘన విజయం



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): విశాఖ నగరంలో గల కోర్టు మైదానంలో జరిగిన క్రికెట్ మ్యాచ్ లో జీవీఎంసీ జట్టు అద్భుత విజయం సాధించిందని జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి తెలిపారు. కోర్టు మైదానంలో బుధవారం జరిగిన వీడిసిఏ ఇన్స్టిట్యూషన్ ఫుల్ "సి" గ్రూప్ మ్యాచ్లో జీవీఎంసీ క్రికెట్ జట్టు పది వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించిందని ఆయన తెలిపారు.

ముందుగా బ్యాటింగ్ చేసిన విపిటిఎస్సి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు నష్టపోయి 97 పరుగులు సాధించిందని, జీవీఎంసీ జట్టు క్రికెటర్ ప్రకాష్ రెండు వికెట్లు తీశారని, అనంతరం బ్యాటింగ్ చేసిన జీవీఎంసీ జట్టు 13.4 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా నష్టపోకుండా 100 పరుగులు సాధించి అద్భుత విజయాన్ని పొందిందన్నారు. జీవీఎంసీ తరపున బ్యాటింగ్ చేసిన ప్రశాంత్ 52 సునంద 40 పరుగులు చేసి జట్టు విజయానికి కీలక పాత్ర పోషించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్, అదనపు కమిషనర్ డి.వి రమణమూర్తి జివిఎంసి క్రికెట్ జట్టు టీమ్ సభ్యులను, టీమ్ మేనేజర్ సన్యాసిరావు లను అభినందిస్తూ అలాగే జీవీఎంసీ కి మరిన్ని విజయాలు అందించే విధంగా కృషి చేయాలని ఆయన తెలిపారు.

## ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన గామారే టెలిస్కోప్ లద్దాఖ్‌లో..

ఆసియాలోనే అతిపెద్దదైన గామా రే టెలిస్కోప్‌ను లద్దాఖ్‌లో ఆవిష్కరించారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ప్రాంతంలో ఏర్పాటుచేసింది కూడా ఇదే కావడం విశేషం. 4,300 మీటర్ల ఎత్తులో ఉన్న హాన్లే ప్రాంతంలో అతిపెద్ద ఇమేజింగ్ చెరెన్‌కోవ్ టెలిస్కోప్‌ను ప్రారంభించారు.

మేజర్ అట్మాస్పియరిక్ చెరెన్‌కోవ్ ఎక్స్‌పరిమెంట్‌గా పిలిచే ఇది ప్రపంచంలోని టెలిస్కోప్‌లలో అత్యంత ఎత్తయినది. ముంబయిలోని బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్.. ఈసీఐఎల్, ఇతర పారిశ్రామిక సంస్థల సాయంతో దీనిని దేశీయంగా రూపొందించడం విశేషం.

అధిక శక్తి గామా రే కిరణాలపై శాస్త్రవేత్తలు అధ్యయనం చేయడానికి MACE అబ్జర్వేటరీగా ఉపయోగపడనుంది. కాస్మిక్ కిరణాల పరిశోధనలో ఇది భారత్‌ను ముందంజలో ఉంచనుందని పరిశోధకులు భావిస్తున్నారు.

సూపర్ నోవా, బ్లాక్ హెూల్స్, గామా రేలపై లోతైన అవగాహనకు ఈ అబ్జర్వేటరీ మార్గం సుగమం చేయనుంది.

ఇది ప్రారంభానికి ముందే 200 మిలియన్ కాంతి సంవత్సరాల దూరంలోని గామా కిరణాలను గుర్తించి సత్తా చాటింది.

21 మీటర్ల వ్యాసం, 175 టన్నుల బరువు, 356 చదరపు మీటర్ల రిఫ్లెక్టర్ ఏరియాను MACE కలిగిఉంటుంది.

**ఎలా పనిచేస్తుందంటే..?**

సాధారంగా గామా కిరణాలు భూ ఉపరితలానికి చేరవు. భూ వాతావరణం వీటిని అడ్డుకుంటుంది. అయితే.. వాతావరణంతో పరస్పర చర్య ద్వారా ఇవి అధిక శక్తి కణాలను సృష్టిస్తాయి. ఇవి విమాన వేగం కంటే అధిక వేగంతో ప్రయాణిస్తూ.. చెరెన్‌కోవ్ రేడియేషన్‌ను విడుదల చేస్తాయి. అబ్జర్వేటరీలోని మిర్రర్లు, కెమెరాలు వీటిని క్యాప్చర్ చేస్తాయి.

**ఈ ప్రాంతమే ఎందుకు..?**

లద్దాఖ్‌లోని హాన్లే ప్రాంతంలో మేజర్ అట్మాస్పియరిక్ చెరెన్‌కోవ్ ఎక్స్‌పరిమెంట్ అబ్జర్వేటరీని ఏర్పాటుచేశారు. ఎన్నో విషయాలను పరిగణనలోకి తీసుకొని ఈ ప్రాంతాన్ని జాగ్రత్తగా ఎంపిక చేశారు. గామా రేలను గుర్తించడానికి అత్యంత తక్కువ లైట్ పొల్యూషన్ ఇక్కడ ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. ఇది అత్యంత ఎత్తయిన ప్రదేశంలో ఉండటంతో.. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల నుంచి కనిపించని మూలాలను గుర్తించడానికి ఇది శాస్త్రవేత్తలకు దోహదపడుతుంది.

**ఇది స్వర్గం లాంటిది**

గామా కిరణాలపై పరిశోధనలు చేసే ఖగోళ శాస్త్రవేతలకు హాన్లే ప్రాంతం స్వర్గం లాంటిదని అటామిక్ ఎనర్జీ కమిషన్ చైర్మన్ డా.ఏకే మొహంతి తెలిపారు. చీకటి ఆకాశం, తక్కువ తేమ, వాయు కాలుష్యం లేని ఈ ప్రాంతం ఎంతో కీలకమని చెప్పారు. ఇలాంటి గామా రే టెలిస్కోప్‌లను ఇక్కడ మరిన్ని ఏర్పాటుచేయవచ్చని ఆయన వెల్లడించారు.

## హర్యానాలో బీజేపీ గెలుపుపై స్పందించిన రాహుల్ గాంధీ

హర్యానాలో బీజేపీ విజయం సాధించడంపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తలకిందులయ్యాయి. హర్యానాలో ఊహించని ఫలితాలు వచ్చాయని... ఈ ఫలితాలపై విశ్లేషణ చేపట్టినట్లు చెప్పారు. చాలా అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఆ ఫిర్యాదులను విశ్లేషించి ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. హర్యానాలో పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ప్రజల హక్కులు, సామాజిక, ఆర్థిక న్యాయం, నిజం కోసం తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ప్రజాగళాన్ని వినిపిస్తూనే ఉంటామని పేర్కొన్నారు. కూటమిని గెలిపించిన జమ్మూకశ్మీర్ ప్రజలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ గెలుపు రాజ్యాంగం సాధించిన విజయం అన్నారు.

హర్యానాలో బీజేపీ వరుసగా మూడోసారి అద్భుత విజయాన్ని సాధించింది. 90 సీట్లకు గాను 48 చోట్ల బీజేపీ గెలిచింది. కాంగ్రెస్ 37 సీట్లకు పరిమితమైంది. నిన్న ఉదయం కౌంటింగ్ ప్రారంభమైనప్పుడు రెండు పార్టీల మధ్య హెూరాహెూరీ కనిపించింది. ఆ తర్వాత క్రమంగా కాంగ్రెస్ వెనుకబడింది. బీజేపీ గెలిచిన పలుచోట్ల మెజార్టీ తక్కువగా ఉంది. దీంతో కాంగ్రెస్ నేతలు ఫలితాలపై అనుమానాలు వ్యక్తం చేశారు.

# పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ ప్రైవేట్‌వారికివొద్దు

## పోర్టు నిధులతో అభివృద్ధి చేయాలని సిపిఎం 11న ధర్నా

## మీడియా సమావేశంలో సిపిఎం కార్యదర్శి జగ్గునాయుడు వెల్లడి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నం పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను ప్రైవేట్‌వారికి పిపిపి పద్ధతిలో ఇచ్చే ఆలోచన తక్షణమే విరమించుకోవాలని, పోర్టు నిధులతోనే అభివృద్ధి చేసి పోర్టు ఉద్యోగులు, కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం డిమాండ్ చేస్తూ ఈ నెల 11వ తేదీన సాలిగ్రామపురం వద్ద ఉన్న పోర్టు హాస్పిటల్ ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మీడియాకు తెలిపారు.

జగదాంబ దరి నండూరి ప్రసాదరావు భవనంలో బుధవారం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.కె.ఎస్.వి. కుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుబ్బారావు, వి.కృష్ణారావులతో కలిసి ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ ప్రెస్‌మీట్‌లో జగ్గునాయుడు పాల్గొని మాట్లాడుతూ పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ 1984లో 150 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్ది ఉద్యోగులకు మెరుగైన వైద్యసేవలందించిందన్నారు. కోవిడ్ సమయంలో కార్మికులు, ఉద్యోగుల కుటుంబాలకు వైద్యం అందించి ప్రాణాలను రక్షించిందన్నారు. ఇప్పుడు దీనిని 300 పడకల మల్టీ డిసిప్లైనరీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడాన్ని సిపిఎం పార్టీ స్వాగతిస్తుందన్నారు. అయితే దీనిని పిపిపి పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం సరికాదు. టెండర్లను పిలవడం రద్దుచేయాలన్నారు. 300పడకల ఆసుపత్రి నిర్మించి కేవలం 80పడకలు మాత్రమే ఉద్యోగులకు కేటాయిస్తామని చెప్పడాన్ని సిపిఎం పార్టీ తీవ్ర వ్యతిరేకిస్తుందన్నారు. 40వేల మంది ఆఫీసర్స్, ఉద్యోగులు, కార్మికులు, మాజీ ఉద్యోగుల కుటుంబాలు ఈ హాస్పిటల్‌లోనే వైద్యం పొందుతున్న సంగతి కేంద్ర బిజెపి ప్రభుత్వం, పోర్టు యాజమాన్యం మర్చిపోరాదన్నారు.

మంచి లాభాల్లో ఉన్న విశాఖపట్నం పోర్టు ప్రభుత్వరంగ సంస్థలో ఉంటూ మంచి లాభాలార్జించింది. క్రమేణా బెర్త్‌లు ప్రైవేటీకరించడం, స్టేడియం, భూములన్నీ ప్రైవేట్‌వారికి దారాధత్తం చేయడానికి పూనుకుంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 380కోట్లు లాభాలతో నడిచింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు 171 కోట్లు పన్నులు చెల్లించింది. కార్గోహాండ్లింగ్‌లో దేశంలో రికార్డులు సాధించింది. ఈ లాభాలకు కారణం ఉద్యోగులు, కార్మికులు. సంస్థ లాభాలకోసం పనిచేస్తున్న కార్మికుల ఆరోగ్యాలను కాపాడాల్సిన యాజమాన్యం ప్రైవేట్ లాభాలు కోసం చూడటం సరైనది కాదు. తక్షణమే విశాఖపోర్టు నిధులతో హాస్పిటల్ నిర్మాణం చేపట్టి ఉద్యోగులకు, కార్మికులకు, రిటైర్డ్ ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేసారు. 11న పోర్టు హాస్పిటల్‌వద్ద జరిగే ధర్నాలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# జనరల్ మరియు స్లీపర్ క్లాస్ కోచ్‌లతో రైళ్లను తాత్కాలికంగా పెంచడం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** పండుగ సీజన్‌లో వెయిట్‌లిస్ట్ చేసిన ప్రయాణికుల అదనపు రద్దీని క్లియర్ చేయడానికి, దిగువ వివరించిన విధంగా అదనపు కోచ్‌లతో రైళ్లను పెంచాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే నిర్ణయించింది.



1. రైలు నెం. 08546 విశాఖపట్నం-కోరాపుట్ ప్యాసింజర్ స్పెషల్ 09.10.2024 నుండి 16.10.2024 వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌తో పెంచబడుతుంది మరియు తిరుగు దిశలో రైలు నెం. 08545 కోరాపుట్ - విశాఖపట్నం ప్యాసింజర్ స్పెషల్‌తో ఒక సెకను జతచేయబడుతుంది. 10.10.2024 నుండి 17.10.2024 వరకు సిట్టింగ్ కోచ్

2. రైలు నం. 08504 విశాఖపట్నం-భవానీపట్న ప్యాసింజర్ స్పెషల్‌ను 10.10.2024 నుండి 17.10.2024 వరకు రెండు జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లతో పెంచుతారు మరియు తిరుగు దిశలో రైలు నెం. 08503 భవానీపట్న-విశాఖపట్నం రెండు జనరల్ ప్యాసింజర్‌తో జతచేయబడుతుంది. 11.10.2024 నుండి 18.10.2024 వరకు క్లాస్ కోచ్‌లు

3. రైలు నెం. 18117 రూర్కెలా-గుణపూర్ రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ 09.10.2024 నుండి 15.10.2024 వరకు ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌తో పెంచబడుతుంది మరియు తిరుగు దిశలో రైలు నెం. 18118 గుణుపూర్ - రూర్కెలా రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ వన్ క్లాస్‌తో జతచేయబడుతుంది. 10.10.2024 నుండి 16.10.2024 వరకు

4. రైలు నం. 18107 రూర్కెలా-జగదల్‌పూర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌తో 09.10.2024, 10.10.2024, 11.10.2024, 13.10.2024 మరియు 14.40 13.10.2024 మరియు 202.40కి 18.10కి తిరిగి వచ్చే దిశలో ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌తో పెంచబడుతుంది. రూర్కెలా ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ 10.10.2024, 11.10.2024, 12.10.2024, 14.10.2024 మరియు 15.10.2024 తేదీలలో ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌తో జతచేయబడుతుంది.

5. రైలు నం. 18447 భువనేశ్వర్-జగదల్పూర్ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ 10.10.2024 నుండి 16.10.2024 వరకు ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌తో పెంచబడుతుంది మరియు తిరుగు దిశలో రైలు నెం. 11.10.2024 నుండి 17.10.2024 వరకు.

6. రైలు నెం. 08532 విశాఖపట్నం-బ్రహ్మపూర్ ప్యాసింజర్ స్పెషల్ 09.10.2024 నుండి 16.10.2024 వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌తో పెంచబడుతుంది మరియు తిరుగు దిశలో రైలు నెం. 08531 బ్రహ్మపూర్ - విశాఖపట్నం ప్యాసింజర్ స్పెషల్‌తో ఒక సెకను జతచేయబడుతుంది. 10.10.2024 నుండి 17.10.2024 వరకు సిట్టింగ్ కోచ్

7. రైలు నం. 08528 విశాఖపట్నం-రాయ్‌పూర్ ప్యాసింజర్ ప్రత్యేక రైలు 11.10.2024 నుండి 17.10.2024 వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌తో పెంచబడుతుంది మరియు తిరుగు దిశలో రైలు నెం. 08527 రాయ్‌పూర్ - విశాఖపట్నం ప్యాసింజర్ స్పెషల్‌తో ఒక సెకను జతచేయబడుతుంది. 12.10.2024 నుండి 18.10.2024 వరకు సిట్టింగ్ కోచ్.

# సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం



**విజయనగరం:** సంక్షేమంతోపాటు అభివృద్ధికి కూడా తమ ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తూ ముందుకు వెళ్తోందని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఘోషా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను మంత్రి శ్రీనివాస్, ఎంఎల్ఏ పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు బుధవారం ప్రారంభించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ, అవసరమైన చోట కొత్తగా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఘోషాసుపత్రిలోని భవనాన్ని సుమారు రూ.35లక్షలతో ఆధునీకరించి అన్నక్యాంటీన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఘోషాసుపత్రిలో రోగుల సహాయకులకు, పనిచేసేవారికి ఈ క్యాంటీన్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. గత ప్రభుత్వం ఆసుపత్రి అభివృద్ధిపై దృష్టి పెట్టకపోగా, నిర్వహణకు కూడా నిధులను విడుదల చేయలేదని అన్నారు. సోలార్ హీటర్ ప్లాంటును మూలకు చేర్చిందని చెప్పారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని విమర్శించారు. ఘోషా ఆసుపత్రిని అభివృద్ధి చేయడంతోపాటు విస్తరించడానికి కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు.

ఎంఎల్ఏ అదితి గజపతిరాజు మాట్లాడుతూ, పట్టణంలో మూడవ అన్న క్యాంటీన్‌ను ప్రారంభించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. అన్న క్యాంటీన్ ద్వారా అతితక్కువ ధరకే నాణ్యమైన భోజనాన్ని అందజేస్తున్నామని, ఇది ఆసుపత్రికి వచ్చే రోగి సహాయకులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. దేశంలోనే సంక్షేమ కార్యక్రమాలకు ఎన్‌టిఆర్ ఆద్యులని, ఆయన బాటలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నడుస్తున్నారని కొనియాడారు. అన్నక్యాంటీన్ల నిర్వహణకు ప్రతీఒక్కరూ తమవంతు సహకారాన్ని అందించాలని కోరారు. తమ మాతృమూర్తి, విజయనగరం మున్సిపాల్టీ తొలి ఛైర్‌పర్సన్ సునీలా గజపతిరాజు తరపున అన్నక్యాంటీన్ల నిర్వహణకు లక్ష రూపాయలను చెక్కును అందజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు, జనసేన నాయకులు పాలవలస యశస్విని, టిడిపి నాయకులు కనకల మురళీమోహన్, అవనాపు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# మనసు పెట్టి పని చేయండి.. మంచి ఫలితాలు సాధించండి

## ఇళ్ల నిర్మాణాలపై సమీక్షలో కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** చిన్నచిన్న సమస్యలను సాకుగా చూపుతూ పనుల్లో జాప్యం ప్రదర్శించటం సరికాదని.. మనసు పెట్టి పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఇళ్ల నిర్మాణాల్లో ఊహించని పురోగతి సాధించాలని హితవు పలికారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్, గ్రామీణ పథకాలపై కలెక్టరేట్ మీటింగు హాలులో బుధవారం ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నిర్మాణాల స్థితిగతుల గురించి ఆరా తీసిన ఆయన పలు మార్గదర్శకాలు జారీ చేశారు. అందరూ సమన్వయంతో పని చేసి నిర్మాణాల్లో జోరు పెంచాలని సూచించారు. రోజుకు 90 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలనే లక్ష్యానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ ప్రణాళికాయుతంగా పని చేయాలని చెప్పారు. చిన్నచిన్న అడ్డంకులను అధిగమించి ముందుకు వెళ్లాలని హితవు పలికారు. వచ్చే వారం నాటికి జీరో రిజల్ట్స్ ఉన్న లేఅవుట్ జిల్లాలో ఉండడానికి వీలులేదని.. అన్ని లేవుట్లలో పనులు జరగాల్సిందేనని నిర్దేశించారు. ఇప్పుడున్న పరిస్థితి మారాలని, దానికి అందరూ బాధ్యతతో కూడిన పనితీరు కనబరచాలని పేర్కొన్నారు. మండల, లేఅవుట్ల ప్రత్యేక అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు.

సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ అల్ల శ్రీనివాసు, ఏడీసీలు రమణమూర్తి, వర్మ, యూసీడీ పీడీ ఫణిరాం, హౌసింగ్ డీఈలు, ఏఈలు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న మైదాన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** గత ఏడాది జరిగిన బదిలీల్లో విశాఖ జిల్లాలో ఎవరూ ఊహించిన విధంగా మైదాన ప్రాంతాల నుండి మారుమూల గిరిజన ప్రాంతానికి బదిలీ అయిన సుమారు 430 సీనియర్ ఉపాధ్యాయులను తిరిగి వారి స్వంత జిల్లాలకు బదిలీ చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డి శ్రీదేవి కోరారు. అనకాపల్లి సిపిఐ కార్యాలయంలో సోమవారం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పివి రమణ నక్క శ్రీనుబాబు, ఎంటిఎస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు వేచలపు ఈశ్వరరావు తో కలిసి ఆమె మాట్లాడారు. తమ సమస్యలు ఇప్పటికే విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్సీలు అశోక్ బాబు, చిరంజీవి, ఏఎస్ రామకృష్ణలకు వివరించడం జరిగిందన్నారు. అమరావతిలో జరిగిన సమావేశంలో నోబుల్ టీచర్స్ చేసిన రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకట్రావు బి హైమారావులు ఈ సమస్య పరిష్కారంకు కృషి చేస్తున్నారన్నారు. అలాగే సమస్య జిల్లాకు చెందిన హెూమ్ శాఖ మంత్రి అనిత దృష్టి కూడా తీసుకువెళ్లడం జరిగిందన్నారు. వీరికి జరిగిన అన్యాయాన్ని గుర్తించి న్యాయం చేస్తామని హామీ కూడా ఇచ్చారన్నారు. గత ప్రభుత్వం తొందరపాటు చర్యలతో తీసుకువచ్చిన 117 జీవోతో విద్యా వ్యవస్థతో పాటు ఉపాధ్యాయులు తీరని అన్యాయానికి గురయ్యారన్నారు. ఇవన్నీ ప్రభుత్వం సరిచేయాలన్నారు. ప్రత్యేకించి గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న మైదాన ప్రాంత ఉపాధ్యాయులను ప్రత్యేక కేటగిరీగా ప్రకటించి బదిలీ చేయాలని ఆమె కోరారు.

# ధరల నియంత్రణకు చర్యలు : జాయింట్ కలెక్టర్ జాహ్నవి





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** నిత్యావసరాల ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి తెలిపారు. బుధవారం ఉదయం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో నిత్యావసర సరుకులు ధరల నియంత్రణపై, సివిల్ సప్లయి, మార్కెటింగు, తూనికలు కొలతల శాఖల అధికారులు, హెూల్ సేల్ వ్యాపారులు, షాపింగుమాల్స్ ప్రతినిధులతో జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాయింటు కలెక్టరు మాట్లాడుతూ ప్రభుత్వ అదేశాల మేరకు నిత్యావసరాల ధరలు నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చర్యలులో భాగంగా ఉల్లిపాయలు, టమోటా, వంటనూనె లను ప్రత్యేక కౌంటర్లద్వారా అమ్మకాలు నిర్వహించుటకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కౌంటర్లలో సరుకులను సాధ్యమైనంత తక్కువ ధరలకు అందించాలని వ్యాపారులకు తెలియజేసారు. కృత్రిమ కొరత సృష్టించకుండా అధికారుల కమిటీ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. సరుకులు స్టాకు, అమ్మకాలపై రోజువారీ రిపోర్టు అందించాలని తూనికలు కొలతల శాఖ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక కౌంటర్లలో సరుకులు విక్రయాలు చేయుటకు హెూల్ సేల్ మార్కెట్లో సమాచారం సేకరించి సరకులు ధరలు నిర్ణయించాలని మార్కెటింగు శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, యలమంచిలి మరియు మేజరు పంచాయతీలలో కౌంట్లరు ఏర్పాటుచేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి టి.వి.ఎల్.ఎన్. మూర్తి, జిల్లా మేనేరు సివిల్ సప్లయి పి. జయంతి, మార్కెటింగు, తూనికలు కొలతల శాఖల అధికారులు, హెూల్ సేల్ వ్యాపారులు, షాపింగుమాల్స్ ప్రతినిధులు హాజరయ్యారు.

# ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** నిత్యావసర సరుకుల ధరల నియంత్రణ చర్యలలో భాగంగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి తెలిపారు. బుధవారం ప్రకటన విడుదల చేస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పౌర సరఫరాలు, మార్కెంటింగు, లీగల్ మెట్రాలజీ శాఖల ఆధ్వర్యంలో అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలిలో సబ్సిడీ ధరలపై ఉల్లిపాయలు, టమోటా, వంటనూనెలు విక్రయాలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి హెూల్ సేల్ మార్కెట్ లలో మరియు అనకాపల్లి బెల్లం మార్కెట్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటరుల ద్వారా ఉల్లిపాయలు కేజీ 60 రూపాయలకు, టమోటా 52 రూపాయలకు, పామోలిన్ ఆయిలు లీటరు 117 రూపాయలకు ఫ్రీడం సన్ఫ్లవర్ ఆయిల్ లీటరు 126 రూపాయలకు, వేరుసెనగనూనె 155 రూపాయలు చొప్పున అమ్మకాలు జరుగునని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గల మోర్, రిలయన్స్, డిమార్ట్, విశాల్ అవుట్ లెట్ లలో కూడా ఇవే ధరలకు సరుకులు లభిస్తాయన్నారు. కావున వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవలనదిగా తెలియజేసారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Kakinada (K.B. Ramarao): Cell: 9949413661, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Bheemili (D.V.Chalapathi Rao) : Cell: 9849603258, Office (Raghunath) : 7013785256. Arilova (D.Venkatesh) : 73825 85777. Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Yelamanchili (P.S.N. Murthy) : 83095 38789 Anakapalli (M.Krishna Rao) : 63023 75539
Paderu (P.Ravi Kumar) : 94908 12271 Parvathipuram (S.S.Naidu) : 94900 27519 Chintapalli (Srinivas) : 94923 40861 Chodavaram (BVR Murthy) : 81431 22188

గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారిని మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.